Follow: @ANNTELUGU
ANN తెలుగు
16-12-2024
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 06 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

డాట్

## మోహన్ బాబు ఎస్కేప్

- ఎక్కడున్నారో తెలియడంటున్న పోలీసులు
- టీవీ రిపోర్టర్ రంజిత్‌కు పరామర్శ
- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



02

హాట్

## పుష్ప-2 నెంబర్ వన్

- హిందీలో రికార్డుల మోత
- రూ.500 కోట్ల క్లబ్‌లో హిందీవర్షెన్
- రెండవ శనివారం అత్యధిక వసూళ్లు
- బాలీవుడ్ రికార్డులన్నీ స్మాష్



02

హీట్

## మన కోసం ఎవరు నిలబడ్డారో వారిని మర్చిపోకూడదు

- పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు
- అల్లు అర్జున్ ప్రస్తావన తెస్తున్న అభిమానులు
- హైదరాబాద్ వచ్చినా పవన్‌ను కలవని అల్లు అర్జున్



02



## అస్తిత్వం కేసీఆర్

### ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీయా?

ప్రత్యేక తెలంగాణ వాదం పేరిట ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రసమితికి 'ప్రాంతీయ అస్తిత్వం' ఆక్సిజన్ లాంటిది. భారతీయ జనతాపార్టీకి 'హిందుత్వ' వాదం ఒక బలమైన అస్తిత్వం. అస్తిత్వాన్ని కాపాడుకోవడమనేది ఎవరైనా తమిళుల నుంచే నేర్చుకోవాలి. దాదాపు అర్ధ శతాబ్దం తమిళనాడులో తమిళ అస్తిత్వం నిలవడానికి, సమున్నతమవడానికి విస్తృత సంక్షేమ కార్యక్రమాలతో పాటు ద్రవిడియన్ సంస్కృతి పట్ల అవాజ్యాను రాగాలు విశేషంగా తోడ్పడ్డాయి.

సీనియర్ జర్నలిస్ట్ ఎస్కె జకీర్ విశ్లేషణ 4లో



మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నాయకులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు... టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్

### బహిరంగ లేఖ..

వివరాలు 3లో

## జమిలి ఎన్నికల బిల్లుకు బ్రేక్

పునరాలోచనలో కేంద్రం



**మహా:** జమిలి ఎన్నికల బిల్లు పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. తాజాగా లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి రెండు బిల్లులు తొలగించారు. ఇప్పుడా ఈ జాబితాలో జమిలి ఎన్నికల బిల్లు లేదు. దీంతో ఈ బిల్లు ఈసారి ప్రవేశ పెట్టకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు డిసెంబర్ 20న పార్లమెంటు సమావేశాలు ముగియనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల బిల్లుపై సందిగ్దత నెలకొనడం చర్చనీయాంశమవుతోంది. జమిలి ఎన్నికల బిల్లు వల్ల పెద్దగా ప్రయోజనం లేదన్న అభిప్రాయం బిజెపి వర్గాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

# టాలీవుడ్‌పై రేవంత్ సిక్సర్



## ఇక్కడ చట్టం పనిచేస్తోంది

- పెద్దరికం లేకపోవడంతో సినీపరిశ్రమకు చిక్కులు
- దిల్ రాజును ఎఫ్ డీసీ ఛైర్మన్ చేసినా స్పందించని ప్రముఖులు
- ప్రభుత్వంపైనే న్యాయపోరాటం చేస్తున్న హీరో నాగార్జున
- పరిశ్రమను ఏకతాటిపైకి తెచ్చే చొరవచూపని చిరంజీవి
- గతంలో జరిగిన సంఘటనలతో మనస్థాపం
- వరుస సంఘటనలతో షేకవుతున్న టాలీవుడ్
- సంచలనంగా సీఎం రేవంత్ కామెంట్లు

06

తెలంగాణలో చట్టం తన పని తాను చేసుకుపోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ కొట్టిన సిక్సర్ తో టాలీవుడ్ చిత్రపరిశ్రమ షేక్ అవుతోంది. ఒక మంత్రిపైనే.. ఒక సినిమా హీరో ఆ మంత్రి, పార్టీ అధ్యక్షుడు క్షమాపణలు చెప్పాక కూడా రాజకీయ ప్రత్యర్థితో కలిసి పోరాటం చేస్తున్నాడంటే టాలీవుడ్ చిత్రపరిశ్రమ ఈ ప్రభుత్వంతో యుద్ధం కోరుకుంటుందా? స్నేహం కోరుకుంటుందా? అన్నది స్పష్టమవుతోంది. కొన్నిసినిమా కుటుంబాలు రాజకీయ ప్రత్యర్థులతో అతి స్నేహసంబంధాలు కొనసాగిస్తున్నాయి. మా చిత్రపరిశ్రమ రాజకీయాలకు అతీతంగా చెప్పే పెద్దలు లేకపోవడం, ప్రభుత్వం నియమించిన పెద్దను గౌరవించకపోవడంతో కోరి సమస్యలు తగ్గించుకుంటున్నారు - మహా, హైదరాబాద్

# ఆంధ్రా 2 తెలంగాణ..

## ఆంధ్రా ధాన్యం.. తెలంగాణ లొల్లి..

- సరిహద్దులు దాటి వస్తున్న వేల క్వింటాల ధాన్యం..బోనస్ డబ్బుల కోసం కక్కుర్తి..
- ముదిగొండ సరిహద్దులో 40 లారీలను పట్టుకున్న పోలీసులు..
- వ్యాపారుల బాగోతాన్ని బట్టబయలు చేసిన తెలంగాణ రైతులు..
- గ్రామాల్లో అడ్డుకుంటున్న రైతులు



వివరాలు 2లో

*పేదల సొమ్మును కాజేస్తారా..? రైతులు కోసం పెట్టిన బోనస్ పథకాన్ని పక్కదారి పట్టించేందుకు ప్లాన్ జరిగిందా..? బోనస్ ను బొక్కెందుకు పందికొక్కులు తయారైయ్యాయా..? ధాన్యం బస్తాలు సరిహద్దులు దాటి వస్తున్నాయా..? తెలంగాణ అధికారులు నిశబ్ధానికి కారణాలేంటీ..? ఆంధ్రా ధాన్యం సరిహద్దులు దాటి తెలంగాణ కు ఎందుకు వస్తాన్నాయి.. కారణం ఎవరు..? కారుకు లేవరు..? ఆంధ్రా నుంచి తెలంగాణ కు వచ్చిన ధాన్యం బస్తాల వెనక సూత్రదారులేవరు..? పాత్రధారులేవ్వరు..? మహా దినపత్రిక అందించే ప్రత్యేక కథనం..*

# భూమిలేని పేదలకు రూ. 12 వేలు

## ఈనెల 28న తొలి విడత చెల్లింపు

- అప్పులపై బీఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమా? : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాష్ట్ర అప్పులపై బిఆర్ఎస్ నాయకులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఫైర్
- గత బిఆర్ఎస్ పాలకులు తినడానికి అప్పులు చేస్తే...
- వాటిని తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేసింది
- పదేళ్ల కాలంలో 7,11,911 కోట్లు అప్పులు చేసిన గత బిఆర్ఎస్ సర్కార్
- సంక్రాంతి పండుగకు రైతు భరోసా డబ్బులు రైతులకు ఇస్తాం
- రైతులకు, వ్యవసాయానికి ఏడాదిలో రూ.50,953 కోట్లు ఖర్చు పెట్టిన ప్రజా ప్రభుత్వం
- సన్న వడ్ల బోనస్ ద్వారా ఎకరాకు 10 నుంచి 15 వేల రూపాయలు అదనంగా రైతులకు లబ్ధి
- రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కొత్తగా నాలుగు విమానాశ్రయాలు ఏర్పాటు
- ఖమ్మం మీడియా సమావేశంలో వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02



తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవడం కోసం

## మరో పోరాటం

- మాజీ మంత్రి కేటీఆర్
- నందిని సిద్దారెడ్డిని కలిసిన మాజీ మంత్రి



వివరాలు 2లో

నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి

## రేసులో లేను

- పార్టీ నాకు పెద్ద బాధ్యతలు అప్పగించింది
- నాకు పార్టీ పగ్గాలనేది ఊహాగానాలే అధ్యక్షుడు ఎవరనేది
- హైకమాండ్ దే తుది నిర్ణయం

06



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,890 |
| 22 క్యారెట్ | 71,400 |
| సిల్వర్ (కేజీ) | 93,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 82,133.12 |
| నిఫ్టీ | 24,768.30 |

### ఈరోజు గుడ్ల ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6.20 | 186 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6.20 | 186 |
| రిటైల్ గుడ్డు ధర | 6.57 | 197.16 |

# మన కోసం ఎవరు నిలబడ్డారో వారిని మర్చిపోకూడదు

## పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు

**అల్లు అర్జున్ ప్రస్తావన తెస్తున్న అభిమానులు**

**హైదరాబాద్ వచ్చినా పవన్ ను కలవని అల్లు అర్జున్**



**మహా:** "మనిషికి మరపు సహజం. మనకు అన్నం పెట్టినవారిని, మనకు తోడుగా నిలిచిన వారిని, మనకు అండగా నిలబడిన వారిని మర్చిపోతారు... కానీ అలాంటి వారిని గుర్తుపెట్టుకోవడం చాలా అవసరం. మనం ఎక్కడ్నించి వచ్చాం అనేది మర్చిపోకూడదు అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎపిలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు అల్లు అర్జున్ కు తగిలేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చేస్తున్నారు. మరోవైపు పవన్ కల్యాణ్ శనివారం రాత్రి హైదరాబాద్ లోనే ఉన్నా అల్లు అర్జున్ కలవలేదు. గత కొన్నేళ్ళుగా మెగా ఫ్యాన్స్ కు, అల్లు ఫ్యాన్స్ కు మధ్య వార్ కూడా సాగుతోంది. మెగా కుటుంబం నుండి విడిపోవడం వల్లే అల్లు అర్జున్ కు దెబ్బతగిలిందన్న చర్చనూ ముందుపెడుతున్నారు. కలిసి ఉంటే బలపడతాం.. విడిపోతే బలహీనమవుతాం అంటూ తాజాగా పవన్ కల్యాణ్ చేసిన కోట్ కూడా వైరల్ గా మారింది.


# పుష్ప-2 నెంబర్ వన్

## హిందీలో రికార్డుల మోత

**రూ.500కోట్ల క్లబ్ లో హిందీవర్షెన్**

**రెండవ శనివారం అత్యధిక వసూళ్లు**

**బాలీవుడ్ రికార్డులన్నీ స్మాష్**



**మహా:** అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో, దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన పుష్ప2 కలెక్షన్ల సునామీ కొనసాగుతోంది. ముఖ్యంగా హిందీ వెర్షన్‌లో ఈ సినిమా అప్రతిహతంగా దూసుకెళుతోంది. శనివారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ.46.50 కోట్లు వసూలు చేసింది. దీంతో హిందీ వెర్షన్‌లో కేవలం 10 రోజుల్లోనే రూ.500 కోట్ల క్లబ్‌లో పుష్ప2 అడుగుపెట్టింది. జవాన్, స్త్రీ2, గదర్2, పఠాన్, బాహుబలి2, యానిమల్ సినిమాలను అధిగమించి మరీ అత్యంత వేగంగా పుష్ప2 ఈ రికార్డు నెలకొల్పింది. శుక్రవారం రూ.27.50 కోట్లు, శనివారం ఏకంగా రూ.46.50 కోట్లతో కలుపుకొని మొత్తం రూ.507.50 కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని బాలీవుడ్ సినీ విశ్లేషకుడు, విమర్శకుడు తరణ్ ఆదర్శ్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తాజా అరెస్ట్ వివాదం కూడా కలెక్షన్లను మరింత పెంచింది. బాలీవుడ్‌లో రెండవ శనివారం అత్యధిక వసూళ్లు (రూ.46.50 కోట్లు) రాబట్టిన చిత్రంగా కూడా పుష్ప2 నిలిచింది. అంతకుముందు స్త్రీ2 మూవీ రూ. 33.80 కోట్లు, గదర్2 రూ. 31.07 కోట్లు, జవాన్ రూ. 31.07 కోట్లు, జవాన్ 30.10 కోట్లు, బాహుబలి2 రూ.26.50 కోట్లు, ది కశ్మీర్ ఫైల్స్ రూ.24.80 కోట్లు, దంగల్ రూ.23.07 కోట్లు, పఠాన్ రూ.22.50 కోట్లు వసూలు చేయగా.. వాటన్నింటినీ పుష్ప2 దాటేసింది.

# మోహన్ బాబు ఎస్కేప్

**ఎక్కడున్నారో తెలియదంటున్న పోలీసులు.. టీవీ రిపోర్టర్ రంజిత్‌కు పరామర్శ**

**కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**



**మహా:** మంచు ఫ్యామిలీ ఫాంహౌస్ వద్ద టీవీ రిపోర్టర్ పై దాడికి సంబంధించి మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు తీవ్రత దృష్ట్యా పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అరెస్టు చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మోహన్ బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బెయిల్ పిటిషన్ ను హైకోర్టు కొట్టేసింది. ఈ క్రమంలోనే మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. గొడవల నేపథ్యంలో లైసెన్స్ డ్ రివాల్వర్ ను హ్యాండోవర్ చేయాలంటూ పోలీసులు నోటీసులు జారీ చేయగా మంచు విష్ణు తన గన్ ను అప్పగించారు. అయితే, మోహన్ బాబు మాత్రం ఇప్పటికీ గన్ అప్పగించలేదు. స్టేట్ మెంట్ రికార్డు చేయడానికి వచ్చినపుడే గన్ అప్పగిస్తానని మోహన్ బాబు చెప్పినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం మోహన్ బాబు ఎక్కడున్నారనే విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని పహాడీ షరీఫ్ పోలీసులు స్పష్టం చేశారు. తాను మెడికేషన్ లో ఉన్నానని, రెండు మూడు రోజుల్లో తానే విచారణకు హాజరవుతానని మోహన్ బాబు సమాచారం అందించారని చెప్పారు. అయితే అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్ళాడని, ముందస్తు బెయిల్ కు ఇతర మార్గాలు ఏవైనా ఉన్నాయోమోనని అన్వేషిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు అనూహ్యంగా ఆస్పత్రిలో ప్రత్యక్షమై టివి రిపోర్టర్ రంజిత్ ను పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

# తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవడం కోసం మరో పోరాటం

## మాజీ మంత్రి కేటీఅర్.. నందిని సిద్దారెడ్డిని కలిసిన కేటీఆర్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ సాహితీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కవి, రచయిత నందిని సిద్ధారెడ్డిని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నందిని సిద్ధారెడ్డి తెలంగాణ ప్రభుత్వం అందించిన కోటి నగదు పారితోషికం, ప్లాట్‌ను తిరస్కరించడం తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో ఒక మైలురాయిగా నిలుస్తుందని కేటిఅర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలో సిద్ధారెడ్డి చూపిన నిబద్ధత, తెగువ తెలంగాణ చరిత్రలో చిరకాలం నిలిచి ఉంటుందన్నారు. తెలంగాణ కోసం కోటి రూపాయాలను, ప్లాట్ ను తిరస్కరించిన సిద్ధారెడ్డి నిర్ణయంపై కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. అల్వాల్‌లోని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో కేటీఆర్, సిద్దారెడ్డి ఉద్యమకాల స్మృతులను నెమరు వేసుకున్నారు. ప్రభుత్వమే తెలంగాణ అస్థిత్వంపైన కుట్రలు చేస్తున్న ఈ తరుణంలో తెలంగాణ సమాజానికి నందిని సిద్ధారెడ్డి గట్టి సందేశం పంపారని కెటిఅర్ అన్నారు. "తెలంగాణ బిడ్డలు తమ అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి ఎన్ని త్యాగాలకైన వెనకాడని, సిద్ధారెడ్డి ఈ ధైర్యవంతమైన నిర్ణయం సమాజానికి గొప్ప సందేశం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణపై ప్రస్తుతం జరుగుతున్న అస్థిత్వ దాడులపై చర్చ జరిగింది. "ఇప్పుడు ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండి తమ హక్కులను రక్షించుకోవాల్సిన, అవసరం ఉందని, తెలంగాణ సమాజం మరోసారి ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. "తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో కవులు, కళాకారులు ఎప్పుడూ ముందుంటారు," అని కేటీఆర్ అన్నారు. నందిని సిద్దారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడిన కేటీఆర్, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. నందిని తాను రాసిన కొన్ని పుస్తకాలను కెటిఅర్ కు అందజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంఎల్సీ దేశ్ పతి శ్రీనివాస్, బి ఆర్ ఎస్ నాయకులు బాల్క సుమన్, దేవి ప్రసాద్, దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

# పుష్య మాసంలో జంగుబాయి ఉత్సవాలు

## జనవరి 1 నుండి ప్రారంభం

**నెల రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు**



**ఆదిలాబాద్, మహా:** పవిత్ర పుష్య మాసంలో జరిగే జంగుబాయి ఉత్సవాలను విజయవంతం చేయాలని జంగు బాయి జాతర నిర్వహణ కమిటీ కోరింది. ఆదివాసుల ఆరాధ్య దైవం జంగు బాయి ఉత్సవాలు జనవరి 1 నుండి 30 వరకు నెల రోజుల పాటు అమ్మవారు కొలువై ఉన్న కుమురం భీమ్ జిల్లా కెరమేరీ మండలం కోటపరందొలి గ్రామంలో నియమ నిష్టలతో కొనసాగుతాయని తెలిపారు. జనవరి 2న దీపారాధన, 13న మహా పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు. 28న శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగియనున్నట్టు వివరించారు. ఆదివాసీ ప్రజలు ఈ నెల రోజులపాటు భక్తి శ్రద్ధలతో జంగుబాయి ఉత్సవాలలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సలాం శ్యాంరాం, గౌరవ అధ్యక్షులు, మరప బాజీరావు, ప్రచార కార్యదర్శి పూర్కా బాపూరావు, కొడప నగేష్, వెట్టి జకు, కొడప జకు, తుంరం మళ్లకు పటేల్, కొడప మోతిరాం, సలాం మాణిక్ రావు, రాయి సిడం జంగు, వెట్టి చందు గురూజీ, మరప కోసు కటోడా, రామారావు కటోడా, మండడి దౌలత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# భూమిలేని పేదలకు రూ.12 వేలు

**ఖమ్మం, డిసెంబర్ 15, మహా.** రాష్ట్ర ఆర్థిక, అప్పుల పరిస్థితిపై ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా తప్పుడు ప్రచారం చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఫైర్ అయ్యారు. ఆదివారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాల కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 7,11,911 కోట్ల రూపాయల అప్పులకు సంబంధించి తమ దగ్గర పక్కా లెక్కలు ఉన్నాయని తెలిపారు. నేడు తాము అప్పులు చేసినట్లుగా ఆ పార్టీ ప్రచారం చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ సర్కార్ తినడానికి అప్పులు చేస్తే.. వారు చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేసిందని క్లారిటీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.54, 118 కోట్లు అప్పులు చేయగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు మొత్తం 66,782 కోట్ల రూపాయలు బ్యాంకులకు కట్టామన్నారు. అసెంబ్లీ లో ఎవరు ఎన్ని అప్పులు చేశారో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నాటికి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పులు 72,658 కోట్లు రూపాయలు ఉండగా, 2024 నాటికి 3,89,673 కోట్ల రూపాయలు గత బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని వివరించారు. కార్పొరేషన్ల పేరిట ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి తీసుకున్న అప్పులు 2014 నాటికి 5,893 కోట్ల రూపాయలు ఉండగా, 2024 నాటికి 95,462 కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీ లేకుండా వివిధ కార్పొరేషన్లు నేరుగా చేసిన అప్పులు 2014 నాటికి ఏమీ లేకపోగా, 2024 నాటికి 59,414 కోట్లు రూపాయలు అప్పు గత పాలకులు చేశారన్నారు. ఇవే కాకుండా గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలకులు ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, హాస్పిటల్, ఉద్యోగుల జిపిఎఫ్, మిడ్ డే మీల్స్, ఫీజు రియంబర్స్మెంట్ తదితర వాటికి అప్పుగా పెట్టినవి 40,154 కోట్ల రూపాయలు ఉన్నాయని, వీటన్నిటిని కలిపితే మొత్తం రూ.7,11,911 కోట్ల అప్పుల భారాన్ని గత బిఆర్ఎస్ పాలకులు ప్రజలపై మోపి తగుదునమ్మ అంటూ కేటీఆర్, హరీష్ రావులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రాష్ట్ర అప్పుల గురించి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులకు బ్యాంకులకు 2014 నాటికి సంవత్సరానికి రూ.6400 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించగా, గత 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేసిన అప్పుల వల్ల అప్పులు మరియు వడ్డీలు కట్టడానికి 66,782 కోట్ల రూపాయలు చెల్లించే దుస్థితికి ఈ రాష్ట్రాన్ని తీసుకెళ్లి గాయి, గాయిగా అరవడం దేనికని నిలదీశారు. టిఆర్ఎస్ నాయకులకు గాలి మాటలు చెప్పడం, లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టు భ్రమలు కల్పించి ప్రజలను మోసం చేయడం బాగా తెలుసని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత బిఆర్ఎస్ పాలకులు చేసిన ఆర్థిక విధ్వంసం అప్పుల గురించి శ్వేత పత్రం అసెంబ్లీలో విడుదల చేసి ప్రజలకు వాస్తవాలు చెప్పామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేస్తున్నదని వివరించారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఏడాదికి రెండు విడతల్లో 12 వేల రూపాయలు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాన్ని ఈనెల 28న అమలు చేయబోతున్నామన్నారు. దేశ స్వాతంత్రం కోసం ఏర్పడిన అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజు డిసెంబర్ 28న రాష్ట్రంలోని నిరుపేద కూలీల కుటుంబాలకు మొదటి విడతగా 6 వేల రూపాయలను ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించారు. అదేవిధంగా రైతు భరోసా చెల్లించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా వచ్చే సంక్రాంతి నుంచి రైతులకు రైతుబంధు డబ్బులు ఇస్తామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రెండు లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ కేవలం 15 రోజుల్లోనే వారి ఖాతాల్లో నేరుగా 21 వేల కోట్ల రూపాయలను జమ చేసి దేశానికి ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వం నిలిచిందన్నారు.

## రైతుల కోసం ప్రజా ప్రభుత్వం 50,953 కోట్లు ఖర్చు చేసింది

ప్రజా ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి, రైతుల కోసం నేరుగా 50,953 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని వివరించారు. రైతు భరోసా కు 7625 కోట్లు, రైతు రుణమాఫీకి 21 వేల కోట్ల రూపాయలు, రైతు బీమా ప్రీమియం చెల్లింపుకు 1514 కోట్ల రూపాయలు, ఫర్ డ్రాప్ మోర్ క్రాప్ కొరకు 40 కోట్ల రూపాయలు రైతులకు విత్తనాల సరఫరా నిమిత్తం 36 కోట్ల రూపాయలు, వ్యవసాయ పంపు సెట్లకు ఇస్తున్న సబ్సిడీకి 11,270 కోట్ల రూపాయలు, వ్యవసాయానికి కావలసిన సాగునీరు (ఇరిగేషన్) పనుల కోసం 9,795 కోట్లు, మొత్తం 50, 953 కోట్ల రూపాయలను ఖర్చు చేసి నిబద్ధత చాటుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని పూర్తిగా విస్మరించగా ప్రజా ప్రభుత్వం ఎకరాకు పదివేల రూపాయలు చెల్లించిందని వెల్లడించారు. బిఆర్ఎస్ కట్టామని చెప్పుకుంటున్న కాలేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మాణం చేసిన ప్రాజెక్టుల నుంచి పారిన నీళ్లతో పండిన ప్రతి గింజను ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను వారం రోజుల్లో రైతులకు చెల్లిస్తున్నామని చెప్పారు. సన్న ఒట్లకు క్వింటాకు 500 బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. సన్న వడ్లపై క్వింటాకు ఇస్తున్న 500 బోనస్ ద్వారా ప్రతి ఎకరాకు పది నుంచి పదిహేను వేల రూపాయలను అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. 1.20 లక్షల కోట్ల రూపాయలతో గొప్పగా, అద్భుతంగా కాలేశ్వరం కట్టామని బిఆర్ఎస్ నాయకులు చెప్పారని, కానీ కాలేశ్వరంతో సంబంధం లేకుండా ఈ ఏడాది వారి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

## రాష్ట్రంలో నాలుగు కొత్త విమానాశ్రయాలు

రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ కోసం ప్రజా ప్రభుత్వం కొత్తగూడెం రామగుండం ఆదిలాబాద్ వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అందులో భాగంగా హైదరాబాద్ నగరంలో ఫ్యూచర్ సిటీని నిర్మాణం చేస్తున్నామన్నారు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మోసిని ప్రక్షాళన చేసి పునర్జీవం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని వెల్లడించారు. అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేస్తాం. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్యన ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్తు తరాలకు అందిస్తామన్నారు.

# ఆంధ్రా 2 తెలంగాణ




## పట్టించుకోని అధికారులు..

**తెలంగాణ లో ధాన్యానికి బోనస్ ఇస్తుండటం తో ఏపీ నుంచి వ్యాపారులు తెలంగాణ రాష్ట్రం లోని పలు మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. గత ఇరవై రోజులుగా ఈ వ్యవహారం నడుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపమా..? అధికారుల నిర్లక్ష్యమా..? లేదంటే వ్యాపారుల వెనకాల తెలంగాణ నుంచి పాత్రధారులు ఎవరైనా ఉన్నారో తెలియదు కానీ..మొత్తానికి భారీగా ధాన్యం ఏపీ నుంచి తెలంగాణకు రావడం గమనార్హం.**

**పాలేరు, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ రైతుల సంక్షేమం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బోనస్ పథకాన్ని పక్కదారి పట్టించేందుకు కొందరు వ్యాపారులు ప్రయత్నాలు ప్రారంభించారు. పేదలైన రైతుల కోసం పెట్టిన పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశ్యంతో పాటు బోనస్ డబ్బులను దండుకునేందుకు వ్యాపారులు ప్లాన్ చేశారు.. దొడ్డి దారిలో ధాన్యం బస్తాలను తరించే ప్రయత్నం చేయడంతో రైతులు అడ్డుతగిలి వ్యాపార బాగోతాన్ని బట్టబయలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీలను పోలీస్ స్టేషన్ కు తరలించారు.. పూర్తి వివరాల్లోకి వెళ్తే

తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన వరి ధాన్యం కు ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ప్రతి క్వింటాకు రూ. 500 చొప్పున తెలంగాణ రాష్ట్ర రైతులందరికీ బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతే కాకుండా మంచి మద్దతు ధరను కూడా రైతులకు చెల్లిస్తోంది. ప్రతి క్వింటాకు రూ.2330 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఈ మేరకు ఈ వానకాల పంట నుంచి ప్రారంభించింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాలేసిన ప్రతి రైతుకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. దీంతో తెలంగాణ రైతులు సంతోషం పడుతున్నారు. అయితే తెలంగాణలో ప్రవేశపెట్టిన భువనస్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధాన్య వ్యాపారులు ఆసరాగా చేసుకొని దందాను ప్రారంభించారు తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన కృష్ణ విశాఖపట్నం తదితరు జిల్లాల నుంచి భారీగా ధాన్యం లారీలను తెలంగాణ ప్రాంతానికి పంపించి మద్దతు ధరతో పాటు బోనసులు కూడా దండుకునేందుకు ఆంధ్ర వ్యాపారులు పెద్ద ఎత్తున కుట్ర పన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ సరిహద్దు మండలాలకు భారీగా ధాన్యం బస్తాలు లారీల్లో వచ్చాయి. 40 లారీల ధాన్యం ఆంధ్ర రాష్ట్రం నుంచి తెలంగాణ ప్రాంతానికి వస్తుండగా రైతులు ఎక్కడిక్కడ అడ్డుకుంటున్నారు. సమాచారం అందుకున్న తెలంగాణ పోలీసులు ఆంధ్రా నుంచి వస్తున్నా లారీలను పట్టుకున్నారు.

**తెలంగాణకు వచ్చిన 15 వేల క్వింటాల ధాన్యం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా, విశాఖపట్నం, విజయనగరం, కర్నూలు తదితర జిల్లాల నుంచి భారీగా వరిధాన్యం తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నాయి. గత నెల రోజుల నుంచి సన్నరకం వడ్లు పదుల సంఖ్యలో లో లారీలు తెలంగాణ ప్రాంతానికి వస్తుండగా, గత రెండు రోజుల నుంచి సుమారు 40 లారీల్లో మధిర నియోజకవర్గం నుంచి మిర్యాలగూడెం వైపు వెళ్తున్నాయి. లారీ కి సుమారు 700బ్యాగులు 300క్వింటాల ధాన్యం వస్తుండగా 40లారీలలో సుమారు 12వేల క్వింటాళ్ల ధాన్యం ఆంధ్ర నుంచి తెలంగాణకు వస్తున్నాయి. మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం వల్లబీ చెక్ పోస్ట్ వద్ద సాధారణ ఫీజు చెల్లించిన ఆంధ్ర వ్యాపారులు, ఆ ధాన్యం ను మిర్యాలగూడెం, హుజుర్ నగర్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ ధాన్యం తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని మిల్లులకు కేటాయించి తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన బోనస్ డబ్బుల కోసం ఈ ధాన్యంను తరలించినట్లు ప్రచారం జరుగుతోంది.. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మద్దతు ధర కూడా చాలా తక్కువ ఉండగా తెలంగాణలో క్వింటాకు రూ.2330 ధర ఉంది. అందుకే ఆంధ్ర వ్యాపారులు అటు మద్దతు ధరతో పాటు ఇటు బోనస్ ను కూడా నొక్కేసేం దుకు ఆంధ్ర వ్యాపారులు ధాన్యం ను తెలంగాణకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. విచిత్రం ఏమిటంటే.. ఆంధ్ర ధాన్యంకు తెలంగాణ రైతుల నుంచి పాస్ పుస్తకాలు వాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**లారీలను అడ్డుకున్న రైతులు..**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాదారం లో ధాన్యం లారీలను రైతులు గ్రామస్తులు అడ్డుకున్నారు. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల నుంచి తెలంగాణ లోని నల్గొండ జిల్లాలోని మిల్లులకు ధాన్యం తరలిస్తుండగా అడ్డుకున్నారు. తెలంగాణలో సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల చొప్పున బోనస్ ఇస్తుండటం తో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు ఏపీలోని మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ, తెనాలి నుంచి దళారులు లారీల ద్వారా సన్న రకం ధాన్యాన్ని తెలంగాణా కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ముదిగొండ నేలకొండపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు పెద్దసంఖ్యలో లారీలు వస్తుండడంతో అనుమానించిన స్థానికులు లారీలను అడ్డుకున్నారు. ఏపీకి జిల్లాలోని పలు ప్రాంతాలు సరిహద్దుగా ఉండడంతో ముదిగొండ మండలంలోని వల్లభి, నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి చెక్ పోస్టు మీదుగా నల్గొండ జిల్లాకు భారీగా ధాన్యాన్ని లారీల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కో లారీలో సుమారు 350 నుంచి 400 క్వింటాళ్ల ధాన్యం రవాణా చేస్తుం డగా ఒక్క లారీకి బోనస్ కింద 2 లక్షల వరకు సొంతం చేసుకుంటున్నరు. ఇక్కడ ధాన్యం అమ్మేందుకు స్థానిక రైతులు వివరాలు సమర్పించాల్సి ఉండడం తో ఏపీ దళారులు స్థానిక అధికారులు, లేదా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సాయం తీసుకుని వారికి కొంత ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలు తప్పించుకునేందుకే ముదిగొండ మండలంలోని వల్లభి, నేలకొండపల్లి మీదుగా కోదాడకు ధాన్యం తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ లు చెపుతున్నారు. అయితే ఈ అక్రమ వ్యాపారం వెనక పాత్రధారులెవ్వరు..? సూత్రధారులు ఎవరు..? అనేది తెలంగాణ పోలీసులు తెల్చాల్సి ఉంది..?

### మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు...

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

# బహిరంగ లేఖ...



*తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత శ్రీ కే.చంద్రశేఖర్ రావు గారికి....*

ఎంతో రాజకీయ అనుభవమున్న మీకు రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు సంబంధించి కొన్ని అంశాలను మీ దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మీ భారత్ రాష్ట్ర సమితి నేతలు మా ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చే దిశగా నేను ఈ లేఖ రాస్తున్నాను. ఆరు దశాబ్దాల పోరాట చరిత్ర గలిగిన తెలంగాణలో ఉద్యమ పార్టీగా గొప్పలు చెప్పుకునే మీ బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో తెలంగాణ వెనుకబాటుకు గురైంది. సెంటిమెంట్ పేరుతో రెండు దఫాలుగా అధికారం చేపట్టిన మీరు గడీల పాలన చే సి ప్రజలకు కన్నీరు మిగిల్చారు. రాష్ట్రానికే గుండెకాయలాంటి సచివాలయానికి రాకుండా ఫాంహౌస్కే పరిమితమై పాలన సాగించడంతో మీ హయాంలో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. మీ పెత్తందారు సర్కార్తో విసిగిపోయిన ప్రజలు మీ పాలనకు చరమగీతం పాడినా మీలో కానీ, మీ కుటుంబ సభ్యుల్లో కానీ, మీ పార్టీ నేతల్లో కానీ ఎలాంటి మార్పు రాలేదు. తెలంగాణ ఏర్పాటుకు పోరాడిరది సబ్బండ వర్గాలైతే, ఇచ్చింది సోనియా గాంధీ అని విశ్వసించిన ప్రజలు మాకు అధికారం కట్టబెడితే ఓర్వలేక మీరు, మీ కుటుంబ సభ్యులు, మీ పార్టీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారు ఇదే పంథాలో సాగితే ప్రజలు మీకు తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయం.

**నూతన తెలంగాణ రాష్ట్రంలో భావోద్వేగాలతో అధికారం చేపట్టిన మీరు మొదటి రోజు నుండే ఇచ్చిన మాటలు తప్పుతూ అడుగడునా వంచనకు పాల్పడ్డారు. తెలంగాణలో మొదటి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని చెప్పిన మీరు, మీ అనుచరులను ఉసిగొల్పి తిమ్మిని బమ్మిని చేసి మీరే సీఎంగా అందలమెక్కారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్యమించిన మీరు పీఠమెక్కాక మాయమాటలతో పాలించారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా సబ్బండవర్ణాలు ప్రాణాలకు తెగించి పోరాడగా, అధికారంలోకి రాగానే మీరు తెలంగాణలో కుటుంబ పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని మీ కుటుంబ సభ్యుల కబంధ హస్తాల్లో బంధించి, మీరు చేసిన ఆరాచకాన్ని ప్రజలు ఎన్నటికీ మరవలేరు.**

తెలంగాణ వస్తే మన రాష్ట్రంలోని ఉద్యోగాలు మనకే వస్తాయనే ఆశతో యువత పెద్దఎత్తున ఉద్యమించగా 'దీక్ష' పేరుతో మీ కుటుంబం ఆడిన నాటకాలు యువత బలిదానాలకు కారణమయ్యాయి. మీ అల్లుడు హరీశ్రావు పెట్రోల్ డబ్బాతో, అగ్గిపులతో డ్రామాలు చేసి అమాయక యువతను బలిదానాలవైపు ప్రోత్సహించారనేది వాస్తవం కాదా? ఉద్యోగాలపై గంపెడాశలు పెట్టుకున్న యువతకు ఉద్యమ సమయంలో ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పిన మీరు, అధికారంలోకి వచ్చాక మీ కుటుంబంలోని సభ్యులకే రాజకీయ ఉపాధి కల్పించుకున్నారు. మీ హయాంలో ఇచ్చిన అరకొర ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లను కూడా పూర్తి చేయలేకపోయారు. నోటిఫికేషన్ ఇచ్చాక మీ అనుచరులతోనే కోర్టుల్లో కేసులు వేయించి ఉద్యోగాల భర్తీ చేపట్టలేదు. పదో తరగతి మొదలు గ్రూప్ 1 పరీక్షల వరకు అన్నింటా అవకతవకలు, గందరగోళమే. మీ పాలనకు భిన్నంగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుల చేసిన ఘనత కాంగ్రెస్దే.

మీ హయాంలో అవినీతిమయమైన టీజీపీఎస్సీపీ ప్రక్షాళన చేయడమే కాకుండా గ్రూప్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని మేము గర్వంగా చెప్పుకుంటున్నాం. ఒక్క ఏడాదిలోనే రాష్ట్రంలో దాదాపు 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశంలోనే రికార్డు నెలకొల్పాం. మేము ఉద్యోగాలు ఇస్తుంటే, మీ పార్టీ వారు వాటిని అడ్డుకోవడానికి కుట్రలు పన్నారనేది బహిరంగ రహస్యం. కొన్ని సాంకేతిక కారణాలపై యువతను రెచ్చగొట్టి పరీక్షలను వాయిదా వేయడానికి మీ కుటుంబ సభ్యులు, మీ పార్టీ నేతలు శతవిధాలా ప్రయత్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్షాల కుట్రలను ఛేదించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఇచ్చిన మాట ప్రకారం యువత ఉపాధికి ప్రాధాన్యతిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మీ పార్టీ నేతలు, కుటుంబ సభ్యులు నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. ఉద్యమంలో మరో నినాదమైన 'నీళ్లు' అంశాన్ని కూడా మీ పాలనలో నీరుగార్చారు. మీరు అధికారంలోకి వచ్చే నాటికి పెండిరగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన బదులు అవినీతే లక్ష్యంగా కొత్తగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. ప్రాజెక్టు పనుల డిజైన్ను ఇంజినీర్లు చేపట్టాల్సి ఉండగా, తానే కాళేశ్వరం డిజైన్ రూపకర్తను అంటూ గర్వంగా చెప్పుకున్న మీరు ప్రాజెక్టు నాణ్యతా లోపంలో కూడా బాధ్యతవహించాల్సి ఉంటుంది.

మీ అవినీతి, అజ్ఞాన చర్యలతో ఇప్పుడు ప్రాజెక్టు మనుగడకే ప్రమాదం ఏర్పడిరది. కాళేశ్వరం ప్రాజెక్టు మీకు, మీ అనుచరులకు ఒక ఏటీఎంలా మారిందనేది అక్షరాల సత్యం. రాష్ట్రంలోని ప్రాజెక్టులను తానే స్వయంగా పర్యవేక్షిస్తూ, తానే అక్కడ కుర్చీ వేసుకొని కూర్చొని వాటిని పూర్తి చేయిస్తానని ఉద్యమ సమయంలో చెప్పిన మీరు ఎన్ని చోట్ల కూర్చున్నారు..? ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారు..? మీరు గొప్పగా చెప్పుకునే కాళేశ్వరం కింద మూడు బ్యారేజీలు పనిచేయకపోయినా తెలంగాణ రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో 66.76 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసేలా సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఈ ఉదాహరణలు చాలు సాగునీటి రంగానికి మీరిచ్చిన ప్రాధాన్యత, మేము ఇచ్చిన ప్రాధాన్యత. వాస్తవాలు ఇలా ఉంటే మీ పార్టీ నేతలు, మీ కుటుంబ సభ్యులు మాపై అవాస్తవాలతో బురదజల్లడం శోచనీయం.

తెలంగాణ నిధులను దోచుకున్నారని ఉద్యమ సమయంలో ప్రజలను రెచ్చగొట్టిన మీరు ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే లేని విధంగా అవినీతికి పాల్పడ్డారు. ప్రాజెక్టులు, ఫ్లైఓవర్లు ఇలా అన్ని రంగాల్లో జరిగిన అవినీతిలో మీ కుటుంబ సభ్యులు, మీ అనుచరుల హస్తం ఉందనేది కాదనలేని సత్యం. ధరణీ పేరుతో మీ పార్టీ నేతలు పేదల భూములు కొల్లగొట్టి దోచుకున్న దాంట్లో తెరవెనుక ఎవరున్నారో జగమెరిగిన సత్యం. 2014 జూన్ 2న రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్తో తెలంగాణ ఉండగా, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుతో ఉందనేది వాస్తవం కాదా..? మీరు చేసిన అప్పులతో ప్రస్తుతం ప్రతి నెల రూ.6500 కోట్ల అసలు, మిత్తీ చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిరది. మీ పాలనలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం రాష్ట్ర భవిష్యత్ తరాలకు శాపంగా మారిందనే విషయాన్ని కాదంటారా?

కాంగ్రెస్ అధినేత రాహుల్గాంధీ నేతృత్వంలో 2022 మే నెలలో వరంగల్లో ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' హామీలను మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేసి మాది రైతు ప్రభుత్వం అని నిరూపించుకున్నాం. మీ హయాంలో రుణమాఫీ ప్రక్రియ ఎంత ప్రహసనంగా మారిందో రైతులు ఇప్పటికీ చెప్పుకుంటారు. అరొకరగా మాఫీ చేసి, లక్షలాది మంది రైతుల రుణమాఫీ ఎగ్గొట్టిన మీకు, మీ పార్టీ వారికి కాంగ్రెస్ను విమర్శించే నైతిక హక్కే లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. మా సంకల్పబలంతో రూ.21 వేల కోట్లు మాఫీ చేయడంతో, రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులు రుణమాఫీ సహాయం పొందడాన్ని మేము గర్వంగా భావిస్తున్నాం. రైతు పక్షపాతి అయిన మా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఓర్వలేని మీ పార్టీ నేతలు, మీ కుటంబ సభ్యులు విమర్శిస్తుంటే ఆ కుటిలత్వాన్ని అన్నదాతలు హర్షించలేకపోతున్నారని మీరు గమనిస్తే మంచిది.

మీ హయాంలో పంట బీమా లేకపోవడంతో రైతాంగం నష్టపోగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 లక్షలకుపైగా రైతులకు బీమా కవరేజీ కోసం రూ.1,433.33 కోట్ల ప్రీమియం చెల్లించింది. అకాల వర్షాలతో నష్టపోయిన 94 వేల మందికి పైగా రైతులకు రూ.95.38 కోట్ల పంట నష్టాన్ని చెల్లించి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఆదుకుంది. సన్నాలు పండిరచిన వారికి రూ.500 బోనస్ చెల్లించింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సంక్రాంతికి రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విధంగా అన్ని రంగాల్లో రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తే అన్నదాతలు హర్షించరనే వాస్తవాన్ని ఎంతో రాజకీయ అనుభవమున్న మీరు, మీ పార్టీ నేతలకు చెబితే మంచిది.

**సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వం అంటూ హడావుడి చేసిన మీరు పీఠమెక్కగానే వీటికి తిలోదకాలిస్తూ తెలంగాణ అస్తిత్వం మీ కుటుంబ సభ్యుల చేతిలో బందీ అయ్యిందంటే....కాదని మీరు గుండెల మీద చెయ్యి వేసుకొని చెప్పగలరా..? మీరు పదేళ్లలో తెలంగాణ అస్తిత్వానికి అడుగడుగునా చేసిన అన్యాయాలను మేము సరిదిద్దుతుంటే ఓర్వలేక ఫాం హౌస్ నుండి మీరిస్తున్న దశ- దిశ మార్గదర్శకాలతో మీ పార్టీ నేతలు, మీ కుటంబ సభ్యులు అక్కసు కక్కుతున్నారు. మీరు అధికారంలోకి రాగానే అంతా కేసీఆర్మయం అన్నట్టు వ్యవహరించారు. తెలంగాణ అస్తిత్వాన్ని మీరు ఎంతగా కాలరాశారంటే మీ పార్టీ పేరులో 'తెలంగాణ' అనే మాట కూడా తొలగించబడింది. మీ దశాబ్ద పాలనలో తెలంగాణలో పేరులో అక్షరాలు, విగ్రహం ఆట, పాట, గేయం ఇలా అన్నింటా రాష్ట్ర అస్తిత్వానికి ప్రమాదం కలిగించారు.**

అధికారంలో ఉన్న పదేళ్లు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయని మీ పార్టీ కాంగ్రెస్ ఆ పని చేస్తే విమర్శించడం ఎంత వరకు సమంజసం? మీరు చేయని పనిని మేము చేస్తే ఆహ్వానించాల్సింది పోయి విగ్రహ రూపురేఖలపై మీ పార్టీ నేతలు, మీ కుటుంబ సభ్యులు వ్యాఖ్యానించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనం. మీ పార్టీ కార్యాలయంలో రాచరికానికి దర్పణంగా కిరీటంతో, బతుకమ్మతో విగ్రహం ఉంటే, మేము ఏర్పాటు చేసిన విగ్రహంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడుతూ సహజసిద్ధమైన మాతృమూర్తిలా ఉంది. తెలంగాణ తల్లి విగ్రహంలో 'బతుకమ్మ' లేదని విమర్శిస్తున్న మీ పార్టీ నేతలు పదేళ్లు ప్రజల బతుకులతో ఎలా ఆడుకున్నారో అందరికీ తెలిసిందే. తెలంగాణలో పదేళ్లు 'బతుకమ్మ' పండుగ, 'తెలంగాణ జాగృతి' పేరిట మీ గారాల బిడ్డ కవిత చేసిన హంగామా అందరికీ తెలిసిందే. సంప్రదాయాన్ని గౌరవిస్తూ మేము విగ్రహ ఆవిష్కరణకి మిమ్మల్ని కూడా సగౌరంగా ఆహ్వానిస్తే మీరు మర్యాదను నిలబెట్టుకోలేకపోయారు. గౌరవ మర్యాదలు నిలబెట్టుకోకపోవడం మీకు ఇది మొదటిసారి కాదు. రాష్ట్ర ఏర్పాటుకు పోరాడిన ఉద్యమకారులను అడుగడుగునా అవమానించిన మీ నుండి ఇంత కంటే ఎక్కువ ఆశించలేం. అహంకార ధోరణితో, వ్యక్తిగత కక్షతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై వివక్ష చూపిస్తూ తెలంగాణ ఉద్యమకారులకు మీరు చేసిన అన్యాయాలను మేము సరిద్ధుతుంటే మాపై విమర్శలు చేయడం దురదృష్టకరం. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉర్రూతలూగించిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతం రచయిత అందెశ్రీపై మీరు కక్షగట్టి అవమానించి, రాష్ట్రానికి పదేళ్లు అధికారిక గీతం లేకుండా చేసిన తీరును మర్చేపోయారా..?

మీరు చేసిన తప్పులను సరిదిద్దడంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని అధికారిక గీతంగా ప్రకటించి కవి అందెశ్రీని గౌరవించుకోవడాన్ని మేము గర్వంగా భావిస్తున్నాం. ఉద్యమంలో తన ఆట, పాట, గజ్జెలతో ఉత్సాహం నింపిన గద్దర్కు మీరు కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వకుండా అవమానిస్తే, మేము నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చి ఆయనను గౌరవించుకున్నాం. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ కన్వీనర్గా ఉన్న కోదండరామ్ను 'నేను తయారు చేసిన లక్ష మందిలో వాడొకడు' అని మీరు అగౌరపరిస్తే, కాంగ్రెస్ ఆయనకు సరైన గుర్తింపు ఇచ్చింది. ఇలా మీరు చేసిన దౌర్భాగ్యపు పనులన్నింటినీ ఒక్కొక్కటి చక్కదిద్దుతుంటే ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన మీరు మాపే మీ కుటుంబ సభ్యులు, మీ పార్టీ నేతలను ఉసిగొల్పడం సమంజసమా..? చివరికి ఉద్యమ సమయంలో తెలంగాణ అంటే 'టీజీ' అనే సంకేత అక్షరాలను కూడా మీరు వదల్లేదు. మీ పార్టీ బీఆర్ఎస్కు దగ్గరగా ఉండేలా దాన్ని 'టీఎస్' అని మార్చడం మీ స్వార్థానికి నిదర్శనం. మేము తిరిగి 'టీజీ'గా మారిస్తే గగ్గోలు పెట్టడం మీ పార్టీ అహంకారానికి తార్కాణం. ఉద్యమంలో పాల్గొన్న కార్మికులను కూడా మీరు అధికారంలోకి వచ్చాక చిన్నచూపు చూశారు. తెలంగాణ ఉద్యమానికే ఊపిరి పోసిన ఆర్టీసీ కార్మికులను మీరు గద్దె ఎక్కగానే మోసంచేశారు. సొంత రాష్ట్రంలో తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని వారు కోరితే మీరు 'నన్నే ప్రశ్నిస్తారా' అనే అహంకారంతో వారిపై కక్షగట్టి సంస్థ మనుగడకే ప్రమాదం తెచ్చిన తీరును యావత్ తెలంగాణ ఎన్నటికీ మర్చేపోదు.

**మహిళా సాధికరిత కోసం కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే 'మహాలక్ష్మి' పథకాన్ని అమలు చేసిందని మేము గర్వంగా చెప్పకుంటున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించి వారికి ఆర్థికంగా బాసటంగా నిలిచింది. ఏటా 3 వేల 500 కోట్ల రూపాయల లబ్ధి జరుగుతుంది. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం. రూ.500 గ్యాస్ అందించి మాట నిలుపుకున్నాం. రాష్ట్రంలో ఏ ఈరెండు పథకాల వల్ల 50 లక్షల కుటుంబాలకు లబ్ధి జరుగుతున్న విషయం మీకు తెల్వదా. త్వరలో మిగతా హామీలను కూడా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నేతలు పనిగట్టుకొని విమర్శిస్తున్నారు.**

అంతేకాకుండా పేదలందరికీ ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య బీమాను రూ.10 లక్షలకు పెంచాం. 'మహాలక్ష్మీ' పథకంలో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చి మాది మహిళా పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకున్నాం. అదే సమయంలో మరోవైపు మీరు, మీ కూతురు కవిత సారా స్కాంలో జైలుపాలు కావడాన్ని రాష్ట్రంలోని మహిళలంతా అసహ్యించుకుంటున్నా... మీరు ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. మహిళలంటే మీకు ఎప్పుడూ చిన్నచూపే! మొదటి తెలంగాణ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేకుండా పాలించిన చరిత్ర మీది. ఇలాంటి మీకు మహిళల సాధకబాధలు అర్థం అవుతాయనుకోవడం మా అత్యాశే.

కామెర్లు వచ్చినవారికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్నట్టు ఉంది మీ పుత్రరత్నం కేటీఆర్ తీరు. మూసీ పునరుజ్జీవనం, సుందరీకరణలో అవినీతి జరిగిందని ఆయన గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్రాజెక్టు కింద డిజైన్లు, కన్సల్టెన్సీలకు రూ.150 (నూట యాభై కోట్లు) కోట్లు కేటాయించడం తప్ప ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదనే వాస్తవాన్ని మీరు గుర్తించాలి. అసలు మూసీ గురించి బీఆర్ఎస్ వారు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. మూసీ సుందరీకరణ చేస్తానని గతంలో మీరు చెప్పిన మాట గుర్తుందా..? దీంతో పాటు హుస్సేన్ సాగర్లో నీటిని కొబ్బరినీళ్లుగా మారుస్తామని మీరు స్వయంగా చెప్పారు. ఇప్పుడు అక్కడ మీరు చెప్పినట్టు కొబ్బరి నీళ్లు తాగడానికి వస్తారా..? మీరు చెప్పినట్టు హైదరాబాద్ డల్లాస్గా, పాతబస్తీ ఇస్తాంబుల్గా మారాయా? పాతబస్తీలో మెట్రో రైలుపై మీరు దాటవేత వైఖరి ప్రదర్శిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనులను పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంది.

కాంగ్రెస్ను విమర్శించడమే పనిగా పెట్టుకునే ట్విట్టర్ కింగ్ కేటీఆర్ మరో అడుగు ముందుకేసి అమృత్ టెండర్లపై విమర్శలు చేశారు. మీ హయాంలో మీ కుమారుడు కేటీఆర్ అనుచర కంపెనీలకు టెండర్లు కట్టబెడితే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసి, రూ.65 కోట్లు ఆదా చేయడంతో ఆయన మా ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. మీ కుటుంబ సభ్యులు కేటీఆర్, కవిత, హరీశ్రావులు డ్రామా ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తూ అవినీతి, కుంభకోణాలపై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడంలా ఉంది. మీ పాలనలో చేపట్టిన ఏ ప్రాజెక్టులను చూసినా ఆయిన తలపెట్టిన ఏ కార్యక్రమాన్ని చూసినా పాముపుట్టలోంచి బయటపడ్డట్లు అవినీతి పాములు బయట కొస్తున్నాయి.

అధికారంలో ఉన్న పదేళ్లు పలు మీడియా సమావేశాలు నిర్వహించి కాకమ్మ కథలు చెప్పిన మీరు, ఇప్పుడు మౌనవ్రతం చేపట్టి ఫాంహౌస్కే ఎందుకు పరిమితమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్నట్టు చెప్పుకునే మీరు ఫాంహౌస్కే పరిమితం కాకుండా, ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి రాష్ట్ర అభివృద్ధికి మీ సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుంది. అంతేకానీ ఇంకా గడీల పాలననే తల్చుకుంటూ మీరు, మీ కుటుంబ సభ్యులు, మీ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజారంజక కార్యక్రమాలను విమర్శిస్తూ పోతే ప్రజలు హర్షించరని, తరిమి కొడుతారని ఇప్పటికైనా గమనించండి, గ్రహించండి. మీ పదేళ్ల కుటుంబ పాలనలో సబ్బండ వర్గాల ఆశలు వమ్ము కాగా, కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. గత సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి గా భట్టి విక్రమార్క గారు, సీనియర్ మంత్రుల నాయకత్వంలో ఒక అద్భుత పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పైన ఇప్పటికైనా అవాకులు చెవాకులు చేయడం మాని ప్రభుత్వానికి సహకరిస్తారని ఆశిస్తున్నాను.

**- బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్,**
**ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు**

## లొంగిపోవాలనుకొనే నక్సలైట్లకు స్వాగతం

### మీ పునరావాసం బాధ్యత మాది.. లేదంటే భద్రతా బలగాలతో కఠిన చర్యలు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**మహా, జాతీయం:** ''లొంగిపోవాలనుకొనే నక్సలైట్లను మేం స్వాగతిస్తున్నాం. ఆయుధాలు వీడండి. లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరండి. మీ పునరావాసం బాధ్యత మాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పుర్‌లో జరిగిన 'బస్తర్ ఒలింపిక్స్' ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విజ్ఞప్తిని తిరస్కరిస్తే.. భద్రతా బలగాలతో కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. బస్తర్‌లో నక్సలిజం అంతమైతే.. ఇక్కడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు కశ్మీర్ కన్నా ఎక్కువ మంది పర్యాటకులు వస్తారు. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తాం'' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. 2026 మార్చి 31 నాటికి భారతదేశాన్ని నక్సల్ రహితంగా మార్చాలన్న ప్రధాని మోదీ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్న సమయంలో తీవ్రవాద శక్తులపై చర్యలు అంత వేగంగా ఉండేవి కాదని విమర్శించారు. ఇక్కడ భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చర్యల్ని వేగవంతం చేశామన్నారు. ఏడాదిలో 287మందిని భద్రతా బలగాలు అంతం చేయగా.. 992మందిని అరెస్టు చేశామని.. 836మంది లొంగిపోయారని వివరించారు.



## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

### సభ ముందుకు రెండు బిల్లులు

**మహా, తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర శాసన సభలో పర్యాటక విధానంపై సోమవారం స్వల్పకాలిక చర్చ జరగనుంది. ఈనెల 9న మొదలైన సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. సోమవారం నుంచి సమావేశాలు తిరిగి కొనసాగనున్నాయి. సమావేశాలు ఎప్పటి వరకు కొనసాగించాలన్నది బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే.. ఇటీవల మృతి చెంది మాజీ ఎమ్మెల్యేలకు సభ సంతాపం తెలపనుంది. అనంతరం ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగుతుంది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ2024 బిల్లు, తెలంగాణ యూనివర్సిటీల అమెండ్‌మెంట్ బిల్లు2024ను సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశ పెడతారు.

## మహారాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ

### 39 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం

**మహా, మహారాష్ట్ర:** మహారాష్ట్ర ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో మంత్రివర్గ విస్తరణ జరిగింది. మహాయుతిలోని మూడు పార్టీలకు చెందిన పలువురు నేతలు మంత్రులుగా ప్రమాణం చేశారు. నాగ్‌పుర్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వీరితో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌ల సమక్షంలో మూడు పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బావాన్‌కులేతోపాటు రాధాకృష్ణ విఖే పాటిల్, చంద్రకాంత్ పాటిల్, గిరీశ్ మహాజన్, గణేశ్ నాయక్, మంగళ్‌ప్రభాత్ లోధా, జయ్‌కుమార్ రావల్, పంకజ ముండే, అతుల్ సావే, అశోక్ ఉయికే, ఆశిశ్ శేలార్, శివేంద్రసిన్హ భోసలే, జయ్‌కుమార్ గోరె మంత్రులుగా ప్రమాణం చేశారు. శివసేన నుంచి గులాబ్‌రావ్ పాటిల్, దాదా భూసే,



సంజయ్ రాథోడ్, ఉదయ్ సామంత్, శంభూరాజ్ దేశాయ్, ఎన్‌సీపీ నుంచి ధనంజయ్ ముండే, హసన్ ముష్రిఫ్, దత్తత్రేయ భార్నే, అధితీ తాత్కరే, మానిక్‌రావ్ కొకాటే, నరహరి జిర్వాల్ తదితరులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

EDITORIAL
ఎడిటోరియల్

# అస్తిత్వం కేసీఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీయా?



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**'తెలంగాణ అస్తిత్వం' అంటే ఏమిటి ? అనే అంశంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఆశ్చర్యమేమిటంటే 'అస్తిత్వం' కూడా రెండు గ్రూపులుగా చీలిపోవడం. బిఆర్ఎస్ అనుకూల,వ్యతిరేక 'శిబిరాలు' గా విడిపోవడం తెలంగాణ వాదులకు దిక్భ్రాంతి కలిగించే అంశం. నందిది సిధారెడ్డి మాటల్లోనే వైరుధ్యాలున్నవి.'సాంస్కృతిక ఉద్యమమే తెలంగాణ ఉద్యమానికి ఇరుసు' అని ఆయన అంటున్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిందేమిటి? నందిని సిధారెడ్డి,జూలూరి గౌరీశంకర్, అల్లం నారాయణ,రసమయి బాలకిషన్ వంటి కొందరిని గుర్తించి పదవులు ఇచ్చినంత మాత్రాన తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన 'సాంస్కృతిక' బృందాలన్నింటినీ సంతృప్తిపరచినట్లు ఎట్లా అవుతుంది.**



''తిరుపతి వెంకటేశ్వరస్వామిది ఏ రాజకీయ పార్టీ? శ్రీ రామచంద్రుడిది ఏ పార్టీ. వాళ్ళు కాంగ్రెస్ పార్టీలో చేరారా? తెలంగాణ తల్లి విగ్రహంలో అభయహస్తం ఉంటే తప్పేమిటి? దానికి రాజకీయాలు ఎట్లా అంటగడతారు? ప్రజలను ఆశీస్సులిస్తున్నట్టు భావించవచ్చును కదా''? అని ప్రముఖ కవి,పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం కోటి రూపాయల నజరానా,300 గజాల భూమి కేటాయించినట్టు ప్రకటించిన వారిలో అశోక్ తేజ కూడా ఉన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులు,ఉద్యమంలో సర్వస్వం కోల్పోయిన వారు,తెలంగాణ ఉద్యమానికి తమ ఆట పాటలతో ఊపిరులూదిన కవులు,కళాకారులను ఆదుకోవడానికి 'ప్రో యాక్టివ్' గా వ్యవహరిస్తుండడం మంచి పరిణామమని అంటున్నారు. అటువంటి వారిని గుర్తించడం ,గౌరవించడం,తగిన విధంగా ఆదుకోవడం కేసీఆర్ హయాంలో మరచిపోయారని పలువురు విమర్శలు వస్తున్నవి. తనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించినందుకు చాలా సంతోషంగా ఉన్నట్టు సుద్దాల అశోక్ తేజ చెప్పారు.

కాగా మరో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి ఈ సత్కారాన్ని తిరస్కరించారు.''కోటి రూపాయలు ముఖ్యం కాదు. కోట్లాది ప్రజల గుండెల తల్లి ముఖ్యం. అందుకే ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరించాను. తెలంగాణ తల్లిచేతిలో బతుకమ్మను తీసేసి గౌరవిస్తామంటే ఎట్లా అంగీకరిస్తాను. శిల్పులు తమ గిరాకీ కోసం చరిత్రను మారిస్తే ఎలా? ఇదే శిల్పి నిన్నటిదాకా అమర వీరుల స్మృతి చి హ్నం చేశారు.ఆ పేరుతో ఆ ప్రభుత్వాన్ని ఖర్చు పె ట్టిం చా రు . ఇప్పు డు తెలంగాణ తల్లిపేరు తో ఖర్చు.ఆ ఖర్చులో మిగుల్చుకోవటం తప్ప ఇందులో ఆ శిల్పులకు తె లం గా ణ సోయి ఎక్కడున్నది? శిల్పుల ను,కవులను ఈ ప్రభుత్వం సరిగ్గా అర్థం చేసుకోవాలె. అభయహస్తం పెట్టిన ట్టు ఉండే మహిళా మూర్తిని నేను ఎక్కడా చూడలేదు.ఈ ప్రభుత్వానికి తెలంగాణ సోయిలేదు.తెలంగాణ ఉద్యమం పట్ల,తెలంగాణ అమరుల పట్ల గౌరవం లేదు.తెలంగాణ అస్తిత్వాన్ని నిర్మించిందే సాంస్కృతిక ఉద్యమం! ఈ సాంస్కృతిక ధార లేకపోయి ఉంటే ఒక రాజకీయ పార్టీ ఇన్ని రోజులు ఉండేది కాదు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారినప్పుడు తెలంగాణ కవులు, రచయితలు ప్రశ్నించారు.తెలంగాణ ప్రేమికులు అస్తిత్వాన్ని కాపాడుకుంటారు''.అని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. ఆయన వ్యాఖ్యలపై ప్రముఖ శిల్పి,చిత్రకారుడు రమణారెడ్డి భగ్గుమన్నారు.సిధారెడ్డి బిఆర్ఎస్ పార్టీ మెప్పు కోసం,కేసీఆర్ మెప్పు కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇందుకు గాను సిద్దారెడ్డికి కోట్లాది రూపాయలు ముట్టాయని కూడా ఆరోపించారు.

**ఒక బలమైన అస్తిత్వంలో నుంచి తాము పుట్టామని,ఆ అస్తిత్వ ఉద్యమంలో తాము పెరిగామని,ప్రజలు తమ మీద విపరీతమైన ఆశలు పెట్టుకున్నారనే అంశాన్ని తెలంగాణ రాష్ట్రసమితి అతి తొందరగా మరచిపోయింది! తెలంగాణ వస్తూనే తెలంగాణ పునఃనిర్మాణమనే స్ఫూర్తితో పాలన ప్రారంభం కావలసి ఉండగా కేసీఆర్ 'తానే ఒక రాజు వలె' పాలన ప్రారంభించారు.తెలంగాణ యువతను,జెఎసిలను, ఎన్‌జిఓలను,ఉద్యమానికి మద్దతు ఇచ్చిన అందరినీ ఆయన పక్కకు నెట్టిపారేశారు.త్యాగాలు చేసిన వాళ్లు ఏమీ కాకుండాపోయారు.**

'తెలంగాణ అస్తిత్వం' అంటే ఏమిటి ? అనే అంశంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఆశ్చర్యమేమిటంటే 'అస్తిత్వం' కూడా రెండు గ్రూపులుగా చీలిపోవడం. బిఆర్ఎస్ అనుకూల,వ్యతిరేక 'శిబిరాలు' గా విడిపోవడం తెలంగాణ వాదులకు దిక్భ్రాంతి కలిగించే అంశం. నందిది సిధారెడ్డి మాటల్లోనే వైరుధ్యాలున్నవి.'సాంస్కృతిక ఉద్యమమే తెలంగాణ ఉద్యమానికి ఇరుసు' అని ఆయన అంటున్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిందేమిటి? నందిని సిధారెడ్డి,జూలూరి గౌరీశంకర్, అల్లం నారాయణ,రసమయి బాలకిషన్ వంటి కొందరిని గుర్తించి పదవులు ఇచ్చినంత మాత్రాన తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన 'సాంస్కృతిక' బృందాలన్నింటినీ సంతృప్తిపరచినట్లు ఎట్లా అవుతుంది.

సిధారెడ్డి ప్రభుత్వ సత్కారాన్ని తిరస్కరించడం 'తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలో ఒక మైలురాయి' గా కేటీఆర్ కీర్తించారు. అయితే 'ఈ ప్రభుత్వానికి తెలంగాణ సోయి లేదు' అన్న సిధారెడ్డి వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమే.ఇందిరాపార్క్ ధర్నా చౌక్ ను మూసివేయడం కావచ్చు,కోదండరాం వంటి మేధావుల పై 'అణచివేత' ను ప్రయోగించడం కావచ్చు.... అలాంటి ఘటనలనూ,అలాంటి చర్యలనూ సిధారెడ్డి సమర్థిస్తున్నట్టు భావించాలా?కేసీఆర్ పట్ల ఆ కవికి విధేయత ఉన్నదా?మొత్తం కేసీఆర్ కుటుంబం పట్ల ఆయనకు విధేయత ఉందా అనే వివాదాస్పద విషయం జోలికి వెళ్లాల్సిన పని లేదు.కానీ సుద్దాల అశోక్ తేజ,కవి జయరాజ్ తదితరుల మాటలకు,సిధారెడ్డి మాటలకు పొంతన లేదు.

సుప్రసిద్ధ వాగ్గేయకారుడు,కవి గోరెటి వెంకన్నను కేసీఆర్ హయాంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ చేశారు.ఆయన కూడా ప్రభుత్వం సత్కరించనున్న వారిలో ఉన్నారు.వీళ్ళెవరూ నిజానికి బిఆర్ఎస్,లేదా కాంగ్రెస్ పార్టీకి గానీ,మరొక రాజకీయ పార్టీకి గానీ సంబంధం లేని వారు.రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమ కార్యకర్తలను గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ పౌర సమాజం స్వాగతిస్తోంది. కాగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,కార్మికులు,కవులు,రచయితలు... అందరినీ 'విభజించి' పాలించడంలో కేసీఆర్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పుడు జరుగుతున్నదీ అదే! తమ పట్ల విధేయంగా ఉన్నవారు మాత్రమే 'తెలంగాణ అస్తిత్వ' రక్షకులుగా,విధేయంగా లేనివారంతా 'తెలంగాణ వ్యతిరేకులు'గా చిత్రీకరించేందుకు బిఆర్ఎస్ నాయకత్వం ప్రయత్నిస్తుండడం ఒక విషాద సన్నివేశం.

**సుప్రసిద్ధ వాగ్గేయకారుడు,కవి గోరెటి వెంకన్నను కేసీఆర్ హయాంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ చేశారు.ఆయన కూడా ప్రభుత్వం సత్కరించనున్న వారిలో ఉన్నారు.వీళ్ళెవరూ నిజానికి బిఆర్ఎస్,లేదా కాంగ్రెస్ పార్టీకి గానీ,మరొక రాజకీయ పార్టీకి గానీ సంబంధం లేని వారు.రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమ కార్యకర్తలను గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ పౌర సమాజం స్వాగతిస్తోంది.కాగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,కార్మికులు,కవులు,రచయితలు... అందరినీ 'విభజించి' పాలించడంలో కేసీఆర్ ప్రత్యేక గుర్తింపు పొందారు.ఇప్పుడు జరుగుతున్నదీ అదే! తమ పట్ల విధేయంగా ఉన్నవారు మాత్రమే 'తెలంగాణ అస్తిత్వ' రక్షకులుగా,విధేయంగా లేనివారంతా 'తెలంగాణ వ్యతిరేకులు'గా చిత్రీకరించేందుకు బిఆర్ఎస్ నాయకత్వం ప్రయత్నిస్తుండడం ఒక విషాద సన్నివేశం.**

ప్రత్యేక తెలంగాణ వాదం పేరిట ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రసమితికి 'ప్రాంతీయ అస్తిత్వం' ఆక్సిజన్ లాంటిది. భారతీయ జనతాపార్టీకి 'హిందుత్వ' వాదం ఒక బలమైన అస్తిత్వం.అస్తిత్వాన్ని కాపాడుకోవడమనేది ఎవరైనా తమిళుల నుంచే నేర్చుకోవాలి. దాదాపు అర్ధ శతాబ్దం తమిళనాడులో తమిళ అస్తిత్వం నిలవడానికి, సమున్నతమవడానికి విస్తృత సంక్షేమ కార్యక్రమాలతో పాటు ద్రవిడియన్ సంస్కృతి పట్ల అవాజ్యానురాగాలు విశేషంగా తోడ్పడ్డాయి.అవే తమిళ రాజకీయ పార్టీలను నిలబెట్టాయి. తమిళ పార్టీల మధ్య తీవ్ర బేధాలున్నా ,అవి విడిపోయినా,విభజింపబడ్డా తమిళ అస్తిత్వమే అన్ని రకాల తమిళ పార్టీలకు ప్రాణం లాంటిది. మరి తెలంగాణ విషయమేమిటి? కేవలం ఆరు సంవత్సరాలలోనే తెలంగాణ అస్తిత్వం బలహీనపడిందంటే, తెలంగాణ ప్రజలు క్రమంగా తమ అస్తిత్వం, దాని జ్ఞాపకాల నుంచి దూరమయ్యారంటే అందుకు కారణాలు ఏమై ఉంటాయి అనేది విశ్లేషించాలి.

తెలంగాణ అస్తిత్వానికి సుదీర్ఘ చరిత్ర ఉంది.తెలంగాణ జ్ఞాపకాలలో సమ్మక్క సారక్క తిరుగుబాటు,కొమరం భీం పోరాటం, భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన సాయుధ పోరాటం సజీవంగా ఉన్నాయి. దొడ్డి కొమురయ్య,ఐలమ్మ,బందగీ,షోయబుల్లా ఖాన్,భాగ్యరెడ్డి వర్మ,సురవరం ప్రతాపరెడ్డిల స్ఫూర్తి తెలంగాణ చైతన్యంలో భాగం.ఈ పోరాటాల చరిత్రే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రాణవాయువులా పని చేసింది.ఒక్క అస్సాంలో తప్పించి,అస్తిత్వం కోసం పెద్ద ఉద్యమం తెలంగాణలో మినహా మరెక్కడా జరగలేదు. తెలంగాణ ఉద్యమకాలంలో కవులు,కళాకారులు,రచయితలు,ప్రభుత్వ ఉద్యోగులు తదితర అన్నిరంగాలలో జెఎసిలు ఏర్పడ్డాయి.ఎంత నిర్బంధం ఉన్నా,ఉస్మానియా,కాకతీయ విద్యార్థులు లక్షల మంది సదస్సులు నిర్వహించారు. పొలిటికల్ జెఎసికి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కోదండరాం అధ్యక్షుడుగా నియమించుకున్నారు. జయశంకర్ ఉద్యమ సారథిగా తెలంగాణకు ఒక సంకేతంగా గుర్తింపు పొందారు.కాళోజీ పాత్ర,ఆయన స్ఫూర్తి చిరస్మరణీయం.

ఒక బలమైన అస్తిత్వంలో నుంచి తాము పుట్టామని,ఆ అస్తిత్వ ఉద్యమంలో తాము పెరిగామని,ప్రజలు తమ మీద విపరీతమైన ఆశలు పెట్టుకున్నారనే అంశాన్ని తెలంగాణ రాష్ట్రసమితి అతి తొందరగా మరచిపోయింది! తెలంగాణ వస్తూనే తెలంగాణ పునఃనిర్మాణమనే స్ఫూర్తితో పాలన ప్రారంభం కావలసి ఉండగా కేసీఆర్ 'తానే ఒక రాజు వలె' పాలన ప్రారంభించారు. తెలంగాణ యువతను,జెఎసిలను, ఎన్‌జిఓలను,ఉద్యమానికి మద్దతు ఇచ్చిన అందరినీ ఆయన పక్కకు నెట్టిపారేశారు.త్యాగాలు చేసిన వాళ్లు ఏమీ కాకుండా పోయారు. తెలంగాణ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయనే ఆశ కల్పించడంతో,లక్షల మంది యువత పరీక్షల కోసం సన్నద్ధం కావడంలో మునిగిపోయారు. కానీ వాళ్ళ ఆశలు నెరవేరలేదు.

తెలంగాణ ఉద్యమానికి నీరు పోసి పెంచిన ఇందిరా పార్క్ వేదికను రద్దు చేశారు.సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి తాళాలు వేశారు.ఉమ్మడి రాష్ట్ర నిర్బంధ సంస్కృతి మరింత ఉధృతంగా తెలంగాణకు వచ్చేసింది.''మన ముఖ్యమంత్రి,మన హోంమంత్రి అందరూ అందుబాటులో ఉంటారు'' అని ప్రొఫెసర్ జయశంకర్ తనతో పదే పదే చెప్పేవారని పౌరహక్కుల ఉద్యమ నాయకుడు హరగోపాల్ ఒక వ్యాసంలో గుర్తు చేశారు. అయితే కేసీఆర్ పాలనలో మంత్రులు కలవకపోవడం ,ప్రజలకు అందుబాటులోకి లేకపోవడం చూసాం.

**ప్రత్యేక తెలంగాణ వాదం పేరిట ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రసమితికి 'ప్రాంతీయ అస్తిత్వం' ఆక్సిజన్ లాంటిది. భారతీయ జనతాపార్టీకి 'హిందుత్వ' వాదం ఒక బలమైన అస్తిత్వం.అస్తిత్వాన్ని కాపాడుకోవడమనేది ఎవరైనా తమిళుల నుంచే నేర్చుకోవాలి. దాదాపు అర్ధ శతాబ్దం తమిళనాడులో తమిళ అస్తిత్వం నిలవడానికి, సమున్నతమవడానికి విస్తృత సంక్షేమ కార్యక్రమాలతో పాటు ద్రవిడియన్ సంస్కృతి పట్ల అవాజ్యానురాగాలు విశేషంగా తోడ్పడ్డాయి.**

ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించిన కోదండరాంపై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారు.తెలంగాణ ఏర్పడితే విద్యా,వైద్య రంగాలకు పూర్వ వైభవం వస్తుందని ఆశించిన వాళ్ళు భంగపడ్డారు. గతంలో ఎన్నడూ లేని దీనస్థితిలోకి ఈ రంగాలు దిగజారిపోయాయి. ఉస్మానియా యూనివర్సిటీ,ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు ఇదివరకటి ప్రాముఖ్యం లభిస్తుందని తెలంగాణ అస్తిత్వానికే గౌరవప్రదమైన చిహ్నాలుగా అభివృద్ధి చెందుతాయని భావించిన ఉద్యమ కార్యకర్తలు తీవ్ర నిరాశ,నిస్పృహలకు లోనయ్యారు.

కేసీఆర్ హయాంలో సాంస్కృతిక రంగాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరిగినట్టు విమర్శలున్నవి.ఈ ప్రాంతాన్ని ఉర్రూతలూగించిన పాటలు ఏమయ్యాయి? తెలంగాణ అస్తిత్వాన్ని అద్భుతంగా పలికించిన అందెశ్రీ 'జయ, జయహే తెలంగాణ' పాట ఏమయ్యింది? ఆర్థికవ్యవస్థ దెబ్బ తింటే కోలుకోవచ్చు,రాజకీయాలను సరిదిద్దవచ్చు కాని సాంస్కృతిక ప్రత్యేక గుర్తింపును కోల్పోతే జాతికి భవిష్యత్తు ఉండదని జయశంకర్ మాట్లాడేవారు. ''తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పునర్నిర్మాణం చేసి చరిత్రపుటల్లో నిలిచిపోదాం అనే చారిత్రక స్పృహ ఉన్న వ్యక్తి కాదు. తెలంగాణ భూములను ప్రేమించారు కానీ, తెలంగాణ ప్రజలను కాదు.భూములు,గుట్టలు,చెట్లు ఎక్కడ ఉన్నాయి,ఆ వ్యాపారం ఎలా చేద్దాం అని ఆలోచించే వాళ్లే కేసీఆర్ హయాంలో చాలామంది ఉండేవారు'' అని మేధావులు చెబుతున్నారు.

**'తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పునర్నిర్మాణం చేసి చరిత్రపుటల్లో నిలిచిపోదాం అనే చారిత్రక స్పృహ ఉన్న వ్యక్తి కాదు. తెలంగాణ భూములను ప్రేమించారు కానీ, తెలంగాణ ప్రజలను కాదు. భూములు,గుట్టలు,చెట్లు ఎక్కడ ఉన్నాయి,ఆ వ్యాపారం ఎలా చేద్దాం అని ఆలోచించే వాళ్లే కేసీఆర్ హయాంలో చాలామంది ఉండేవారు'' అని మేధావులు చెబుతున్నారు.**


తెలంగాణ 'అస్తిత్వం' గురించి గుండెలు బాదుకునే అర్హత బిఆర్ఎస్ కు లేదని సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి,మంత్రులు శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి నాయకులు అంటున్నారు.అడ్డగోలుగా తెలంగాణను నంజుకొని తిన్న వాళ్ళు 'తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం' పేరిట ఎన్ని నాటకాలు ఆడినా ప్రజానాదరణ లభించదని అంటున్నారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

## వీటిని ఎట్టి పరిస్థితిలోనూ ఫ్రిజ్‌లో పెట్టకూడదు..!



ఈ రోజుల్లో చాలా మంది ఫ్రిజ్‌లను కొనుగోలు చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాదు. ఒకప్పుడు కేవలం ధనికుల ఇళ్లలోనే ఫ్రిజ్ లు ఉండేవి. కానీ ఇప్పుడు సామాన్యులు కూడా ఈఎంఐ పద్ధతిలో వీటిని కొంటున్నారు. అయితే ఫ్రిజ్ కొనడం వరకు బాగానే ఉంటుంది. కానీ అందులో దేన్ని పడితే దాన్ని పెడుతున్నారు. సాధారణంగా మార్కెట్‌లో మనం రకరకాల ఫుడ్ ఐటమ్స్‌ను కొనుగోలు చేస్తుంటాం. అయితే అవి పాడైపోతాయేమోనన్న భయంతో చాలా మంది అన్ని రకాల ఆహారాలను ఫ్రిజ్‌లో పెడుతుంటారు. కానీ వాస్తవానికి అలా చేయడం మంచిది కాదు. కొన్ని రకాల ఆహారాలను అసలు ఫ్రిజ్‌లో పెట్టకూడదు. అలా పెడితే వాటిల్లో ఉండే పోషకాలు నశిస్తాయి. అలాంటి ఆహారం తింటే మనకు పడకపోవచ్చు. కొందరికి ఫుడ్ పాయిజన్ అయ్యే చాన్స్ కూడా ఉంటుంది. కనుక ఫ్రిజ్‌లో అన్ని ఆహారాలను పెట్టకూడదు.

**కీరదోస, టమాటా..**

కూరగాయలు కొనేటప్పుడు ప్రతి ఒక్కరూ కీరదోసను కచ్చితంగా కొంటారు. అయితే వాటిని ఫ్రిజ్‌లో అసలు పెట్టవద్దు. ఎందుకంటే ఫ్రిజ్‌లో చల్లదనానికి అవి మెత్తబడిపోతాయి. సొట్టలు పడి తాజాదనం పోతుంది. కట్ చేసి పెడితే నీరుకారిపోతాయి. గది ఉష్ణోగ్రతలోనే కీరదోస తాజాగా ఉంటుంది. కనుక వీటిని ఎట్టి పరిస్థితిలోనూ ఫ్రిజ్‌లో పెట్టకూడదు. అలాగే టమాటాలను ఫ్రిజ్‌లో పెడితే చల్లదనానికి పైపొర పాడవుతుంది. కిచెన్ టెంపరేచర్‌లోనే వాటిని ఉంచాలి. అందువల్ల మరీ ఎక్కువగా టమాటాలను కొనకుండా ఎంత అవసరమో అంత వరకు తాజాగా కొనుగోలు చేయడం మంచిది.

**డ్రై ఫ్రూట్స్..**

బాదంపప్పు, వాల్ నట్స్, ఖర్జూరాలు, జీడిపప్పు లాంటి వాటిని ఫ్రిజ్‌లో పెడితే రుచి పోతుంది. గాలి చొరబడని డబ్బా లేదా సీసాలో నట్స్ లేదా డ్రై ఫ్రూట్స్‌ను ఉంచి గట్టిగా మూత పెట్టాలి. ఫ్రిజ్ బయట వేడి ఎక్కువగా లేని చోట ఆ డబ్బాను ఉంచితే రుచి ఏమాత్రం తగ్గదు. అలాగే బ్రెడ్ స్లైస్‌కి అద్దుకుని తినే చాక్లెట్ స్ప్రెడ్‌ను ఫ్రిజ్‌లో పెడితే గట్టి పడుతుంది. దీంతో బ్రెడ్ స్లైస్ మీద చక్కగా పరుచుకోదు. రుచి కూడా మారుతుంది. చాక్లెట్ స్ప్రెడ్‌ని కూడా టైట్ జార్ లో ఉంచి మూత గట్టిగా పెట్టాలి.

**తేనె, వెల్లుల్లి..**

వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెడితే తేమకు పాడైపోతాయి. రాత్రి వంటకు లేదా మర్నాడు లంచ్‌కు ఒలిచి సిద్ధం చేసి పెట్టుకున్న వెల్లుల్లిని తప్ప మామూలుగానైతే బయటే ఉంచాలి. బయట ఉంచితేనే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. అలాగే తేనెను కూడా ఫ్రిజ్ లో పెట్టరాదు. తేనె ఫ్రిజ్‌లోని చల్లదనానికి చిక్కబడిపోతుంది. అందులో ఉండే చక్కెర కణాలన్నీ ఉండలు చుట్టుకుపోతాయి. అదేవిధంగా ఉల్లిపాయలను వెలుతురు సోకని చల్లని ప్రదేశంలో ఉంచాలి. ఫ్రిజ్‌లో పెట్టవద్దు. పెడితే మెత్తబడి చెమ్మగిల్లుతాయి. అలాగే ఫ్రిజ్ లోని చల్లదనం ఆలుగడ్డలోని పిండి పదార్థాన్ని చక్కెరగా మారుస్తుంది. దీంతో ఆలు రుచి మారుతుంది. రంగు కూడా మారుతుంది. కనుక ఆలుగడ్డలను బయటి వాతావరణంలోనే ఉంచాలి.

# వెనుదిరిగిన నలుగురు గ్రూప్-2 అభ్యర్థులు

**ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్షలు**

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్**

**9 కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత**








**ములుగు, మహా:** జిల్లాలో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో 9 కేంద్రాలను ఏర్పాటు చేయగా 2195మందికి పరీక్షలు నిర్వహించారు. మొదటిరోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు జరుగగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ములుగులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బాలుర ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, సాధన, బ్రిలియంట్, బిట్స్ ఉన్నత పాఠశాలలు, జాకారం సోషల్ వెల్ఫేర్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మహర్షి కళాశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేశారు. ఉదయం పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సంపత్ రావు పరిశీలించారు. అభ్యర్థులకు తాగునీరు, పవర్ కట్ లేకుండా చూడాలని ఆదేశించారు. నిబంధనలు పాటించాలని, టీజీపీఎస్సీ కమిషన్ మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఉదయం 9.30గంటలు, మధ్యాహ్నం 2.30 గంటల తరువాత పరీక్షా కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. ఉదయం సెషన్ లో 2195మందికి గాను 1118 మంది హాజరు కాగా, 1077మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్ లో 1115మంది హాజరు కాగా 1080మంది గైర్హాజరయ్యారు. ఉదయం 50.93శాతం, మధ్యాహ్నం 50.80శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా, ఆదివారం జరిగిన పరీక్షకు సమయానికి రాకపోవడంతో నలుగురు అభ్యర్థులు వెనుదిరిగినట్లు తెలిసింది.

## పుష్య మాసంలో జంగుబాయి ఉత్సవాలు

- జనవరి 1 నుండి ప్రారంభం
- నెల రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు




**ఆదిలాబాద్, మహా:** పవిత్ర పుష్య మాసంలో జరిగే జంగుబాయి ఉత్సవాలను విజయవంతం చేయాలని జంగు బాయి జాతర నిర్వహణ కమిటీ కోరింది. ఆదివాసుల ఆరాధ్య దైవం జంగు బాయి ఉత్సవాలు జనవరి 1 నుండి 30 వరకు నెల రోజుల పాటు అమ్మవారు కొలువై ఉన్న కుమురం భీమ్ జిల్లా కెరమేరీ మండలం కోటపరందొలి గ్రామంలో నియమ నిష్టలతో కొనసాగుతాయని తెలిపారు. జనవరి 2న దీపారాధన, 13న మహా పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు. 28న శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగియనున్నట్టు వివరించారు. ఆదివాసీ ప్రజలు ఈ నెల రోజులపాటు భక్తి శ్రద్ధలతో జంగుబాయి ఉత్సవాలలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సలాం శ్యాంరాం, గౌరవ అధ్యక్షులు, మరప బాజీరావు, ప్రచార కార్యదర్శి పూర్కా బాపూరావు, కొడప నగేష్, వెట్టి జకు, కొడప జకు, తుంరం మళ్లకు పటేల్, కొడప మోతిరాం, సలాం మాణిక్ రావు, రాయి సిడం జంగు, వెట్టి చందు గురూజీ, మరప కోసు కటోడా , రామారావు కటోడా, మండడి దౌలత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే టీఎస్ టీయూఎఫ్ లక్ష్యం

- 6వ మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య వెల్లడి
- సంఘం నిరంతరం పోరాటాలు చేస్తుందని స్పష్టం



**ఆదిలాబాద్, మహా:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ టీయూఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య తెలిపారు. పట్టణంలోని నూతన అంబేద్కర్ భవనంలో యూనియన్ ఆరవ మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ టీయూఎఫ్ తరపున చేసిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణ, ఇతరత్రా అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ... దేశంలో వంద శాతం విద్యావంతులు కావాలని, అక్షరాస్యత మెరుగుపడడం సరిపోదని అన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరపున నిరంతర పోరాటాలు చేస్తున్నామని, పోరాటాల ఫలితంగానే పదోన్నతులు, బదిలీలు జరిగినట్లు వివరించారు. మిగిలిన సమస్యల సాధనకు సైతం ఐక్యంగా ఉండి ఉద్యమించాలన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిలు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సాయిలింగిలో భక్తుల కిటకిట

**ఆదిలాబాద్, మహా:** తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామంలో ఘనంగా శ్రీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లు భక్తులతో కిటకిటలాడాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ సాయినాథుడిని దర్శించుకున్నారు. మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నేడు రథోత్సవంతో ముగిసింది. చివరి రోజున ఆదివారం భక్తులకు మహా అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు.

## ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్ష

- జిల్లాలో మొత్తం 29 కేంద్రాలు



**ఆదిలాబాద్, మహా:** జిల్లాలో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పరీక్షలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగగా.. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్న నేపథ్యంలో గంట ముందుగానే కేంద్రల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. నిమిషం ఆలస్యమైనా కూడా అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. ఉదయం పది నుండి 12 గంటల ముప్పై నిమిషాల వరకు, మధ్యాహ్నం మూడు నుండి సాయంత్రం అయిదు గంటల ముప్పై నిమిషాల వరకు పరీక్షా కొనసాగింది. అభ్యర్థులు హాల్ టికెట్ నెంబర్లను సరిచూసుకున్న అనంతరంలోనికి వెళ్ళారు. జిల్లాలో మొత్తం 29 కేంద్రాల్లో పరీక్షలు జరుగగా.. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షాతోపాటు ఎస్పీ గౌష్ ఆలంలు సైతం పలు కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ ను అమలు చేసి పటిష్ట పోలిసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం సెషన్ కు 10,428 మంది అభ్యర్థులకు గాను 5,905 మంది హాజరు కాగా... 4,523 మంది గైర్హాజరైనట్లు అధికార వర్గాలు వెల్లడించారు. ఇక పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా.... అధికార యంత్రాంగానికి అవసరమైన సూచనలు చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, బయోమెట్రిక్, అభ్యర్థుల హాజరు శాతాన్ని, సీసీ కెమెరాల పని తీరును పర్యవేక్షించారు. టీజీపీఎస్సీ మార్గదర్శకాలను పాటిస్తూ... ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆది, సోమవారాల్లో సెషన్ల వారీగా పరీక్షా జరగనుందని వెల్లడించారు. అదేవిధంగా పలు కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ గౌష్ ఆలం.. అన్ని కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎలాంటి ధర్నాలు, ర్యాలీలకు అనుమతులు లేవని, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని తెలియజేశారు. జవాబు పత్రాల తరలింపుకు కూడా ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు కల్పించనున్నట్లు తెలిపారు.

## బాసర ఆలయానికి పోటెత్తిన భక్తులు

- గురు పౌర్ణమి సందర్భంగా భక్తుల సందడి
- గోదావరి లోపుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనం



**నిర్మల్, మహా:** నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడం గురు పౌర్ణమి దత్తాత్రేయ జయంతి సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ లైన్ లో వేచి ఉన్నారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకుల చేత అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దత్తాత్రేయమందిరంలో ఆలయ కమిటీ నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకం,అర్చన విశేష పూజలు నిర్వహించి భక్తులకు ఉచిత అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు.

## ఈ నెల 16న ప్రజావాణి రద్దు

**కలెక్టర్ రాజర్షి షా వెల్లడి**



**ఆదిలాబాద్, మహా:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్నిఈ నెల 16 సోమవారం రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. 15, 16తేదీలలో గ్రూప్ 2 పరీక్షలు ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లాలోని దరఖాస్తుదారులు దీనిని గమనించి సోమవారం కలెక్టరేట్ కు రాకూడదని కలెక్టర్ కోరారు.

## తిరుమల ఆపదమొక్కులవాడికి రూ.3.77 కోట్లు ఆదాయం





**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు 7 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 9 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న 63,722 స్వామివారిని దర్శించుకోగా 22,225 తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.77 ఆదాయం వచ్చిందన్నారు. 28న 'డయల్ యువర్ ఈవో' టీటీడీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం డిసెంబరు 28న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు ఈవో శ్యామల రావు తెలిపారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని, భక్తులు 08772263261 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## పరిష్కారమైన కేసులు 1,60,313

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన**

**పాల్గొన్నహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పంచా క్షరి**



**చర్లపల్లి, డిసెంబర్ 14:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పంచాక్షరిలు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావుతో కలిసి ప్రారంభించారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా ఇరువై నాలుగు బెంచిలను ఏర్పాటు చేసి 456 సివిల్ కేసులు, 1,59,476 అన్ని రకాల క్రిమినల్ కేసులు, 381 ఫ్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ కక్షిదారులకు సమ న్యాయంతో పాటు సత్వర న్యాయం అందించేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని, కక్షిదారులు పట్టుదలకు పోకుండా రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకొవాలని ఆయన సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ్య మార్గమని, కేసులను సత్వరమే పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని, జాతీయ లోక్ అదాలత్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. లోక్ అదాలత్‌లో 13.1కోట్ల పరిహారం చెల్లించామని ఆయన పేర్కొన్నారు. ఈ లోక్ ఆదాలత్‌లో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, 1వ అదనపు న్యాయమూర్తి రఘునాధ్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి విక్రం, కుషాయిగూడ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ మహేశ్, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, బార్ అసోసియెషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డిలతో పాటు న్యాయవాదులు, కక్షిదారులు, పోలీస్‌సిబ్బంది, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగల దాడిలో డీఎస్పీకి తీవ్ర గాయాలు..

**ఆస్పత్రికి తరలింపు**

**అమరావతి :** ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా బందోబస్తు కోసం ఆ ప్రాంతానికి వెళ్లిన పోలీసులపై తేనెటీగలు దాడి చేశాయి. ఆదివారం బాంబ్ ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు పోలవరం స్పిల్‌వే గేట్ వద్ద తనిఖీ చేస్తుండగా తేనెటీగలు డీఎస్పీపై దాడి చేశాయి. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది.ఎన్నికల్లోనూ ప్రధాన హామీలో ఒక్కటైన పోలవరం జాతీయ ప్రాజెక్టు పోలవరానికి కేంద్రం అత్యధికంగా నిధులు ఇస్తుండడంతో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ప్రతి వారం ప్రాజెక్టును సందర్శిస్తానని అధికార పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ఆరు నెలల కాలంలో రెండోసారి సోమవారం ప్రాజెక్టుకు వెళ్లనున్నారు. జనవరి 2 నుంచి ప్రారంభించబోయే కొత్త డయాఫ్రం వాల్ పనుల గురించి ప్రాజెక్టు వద్ద అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. 2016 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇది వరకే ప్రభుత్వం ప్రకటించింది.

## విజయవంతంగా విశాఖ నేవీ మారథాన్..15వేల మంది హాజరు




భారత నౌకాదళం ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో విశాఖ ఆర్‌కే బీచ్‌రోడ్‌లో ఆదివారం నిర్వహించిన 9వ వైజాగ్ నేవీ మారథాన్ 2024 విజయవంతం అయ్యింది.9 దేశాల నుంచి వచ్చిన మారథాన్ క్రీడకారులు పాల్గొన్నారు. నిర్వాహకులు నాలుగు విభాగాల్లో 42, 21, 10, 5 కి. మీల మారథాన్ నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## మెగాస్టార్ చిరంజీవి ఇంటికి అల్లు అర్జున్

**మహా:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జైలు నుంచి విడుదలైన అనంతరం మొదటిసారిగా ఆదివారం చిరంజీవి ఇంటికి వెళ్ళారు. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నివాసానికి బన్నీనే స్వయంగా కారు నడుపుకుంటూ తన ఫ్యామిలీతో కలిసి వెళ్లాడు. ఇక మెగాస్టార్ ఇంట్లో దాదాపు గంటన్నరసేపు గడిపిన అల్లు అర్జున్ చిరంజీవి ఫ్యామిలీతో కలిసి లంచ్ చేశాడు. అనంతరం తన అరెస్ట్‌కు సంబంధించి కేసు ఘటనపై చిరు అల్లు అర్జున్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నాడు. కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్న చిరు అనంతరం బన్నీకి న్యాయపరమైన సలహాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. తర్వాత నాగబాబు ఇంటికి కూడా అల్లు అర్జున్ వెళ్ళారు.



## బిగ్ బాస్ విన్నర్‌గా నిఖిల్

### కన్నడ మలియక్కల్‌దే కప్పు

### గౌతమ్ రన్నర్

**మహా:** బిగ్ బాస్ సీజన్ 8 విజేత ఎవరనే ఉత్కంఠకి తెరపడింది. దాదాపు 105 రోజుల పాటు సాగిన ఈ ఆటలో విజేత ఎవరనేది తేలిపోయింది. కన్నడ మలియక్కల్ నిఖిల్ బిగ్ బాస్ సీజన్ 8 విజేతగా అవతరించాడు. గోరింటాకు సీరియల్ ద్వారా తెలుగు ఆడియన్స్‌కి దగ్గరయ్యాడు నిఖిల్ మలియక్కల్. ఈ సీరియల్‌లో పార్థుగా అలరించాడు నిఖిల్. నిఖిల్ సొంతూరు కర్ణాటకలోని మైసూర్. అలానే నిఖిల్ తండ్రి ఓ జర్నలిస్ట్ కావడం విశేషం.

### జనరేటర్‌లో పంచదార పోయించి,

## విద్యుత్తు సరఫరా నిలిపివేశారు

### మంచు ఫ్యామిలీలో మళ్లీ వివాదం!

**హైదరాబాద్, మహా :** మంచు ఫ్యామిలీలో వివాదం ముగియలేదు. తాజాగా మరో వివాదం తెరపైకి వచ్చింది. మంచు మనోజ్ తాజా స్టేట్‌మెంటే అందుకు నిదర్శనం. శనివారం తన కుటుంబంలో చోటుచేసుకున్న ఘటన గురించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంచు విష్ణు తన ఇంటి వద్ద జనరేటర్‌లో పంచదార పోయించి, విద్యుత్తు సరఫరా నిలిపివేశారని మనోజ్ ఆరోపించారు. 'నిన్న నేను సినిమా షూటింగ్లో ఉన్నాను. కుమారుడి పాఠశాలలో ఈవెంట్‌కు నా భార్య హాజరైంది. మా అమ్మ బర్త్డే సందర్భంగా కేకు ఇచ్చే నెపంతో నా సోదరుడు మంచు విష్ణు తన అనుచరులు రాజ్ కొండూరు, కిరణ్, విజయ్ రెడ్డిలతోపాటు కొందరు బౌన్సర్లతో ఇంట్లోకి ప్రవేశించాడు. జనరేటర్లలో షుగర్(పంచదార) పోయించాడు. దాంతో, ఇంటికి రాత్రి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో మేమంతా ఆందోళనకు గురయ్యాము. ఇంట్లో అమ్మ, 9 నెలల కుమార్తె, కుమారుడు, అత్తమామలు ఉన్నారు. ఈ చర్యతో అగ్ని ప్రమాదం(ఫైర్) సంభవించే అవకాశం ఉంది. జనరేటర్లకు సమీపంలో వెహికిల్స్ పార్క్ చేసి ఉన్నాయి. అక్కడే గ్యాస్ కనెక్షన్ కూడా ఉందని' మనోజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

**ఇలా జరగడం హృదయాన్ని కలచివేసింది**

మంచు విష్ణు టీమ్ ఇంటి నుంచి వెళ్లిపోతూ నా వద్ద పనిచేసే వారిని అక్కడ నుంచి పంపించివేసిందని మంచు మనోజ్ ఆరోపించారు. తన దంగల్ కోచ్‌ను కూడా బెదిరించిందన్నారు. అమ్మ పుట్టినరోజున ఇలా జరగడం హృదయాన్ని కలచివేసిందని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను, నా కుటుంబం భయం భయంతో బతుకుతున్నాం. దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాను. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాను' అని మనోజ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై పహాడీ షరీఫ్ ఠాణాకు వెళ్లి మనోజ్ ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

# టాలీవుడ్‌పై రేవంత్ సిక్సర్



### ఇక్కడ చట్టం పనిచేస్తోంది

- పెద్దరికం లేకపోవడంతో సినీపరిశ్రమకు చిక్కులు
- దిల్ రాజును ఎఫ్ డీసీ ఛైర్మన్ చేసినా స్పందించని ప్రముఖులు
- ప్రభుత్వంపైనే న్యాయపోరాటం చేస్తున్న హీరో నాగార్జున
- పరిశ్రమను ఏకతాటిపైకి తెచ్చే చొరవచూపని చిరంజీవి
- గతంలో జరిగిన సంఘటనలతో మనస్థాపం
- వరుస సంఘటనలతో షేకవుతున్న టాలీవుడ్
- సంచలనంగా సీఎం రేవంత్ కామెంట్లు

### అల్లు అర్జున్ అరెస్ట్

అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా ప్రీమియర్స్‌లో భారీ ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ప్రీమియర్ చూసేందుకు బన్నీ రావడంతో ఫ్యాన్స్ అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో తొక్కిసలాట జరగగా.. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు తీవ్ర గాయాలతో హాస్పిటల్ పాలయ్యాడు. దీంతో పోలీసులు అల్లు అర్జున్, థియేటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే బన్నీని పోలీసులు రీసెంట్‌గా అరెస్టు చేశారు. అక్కడితో ఆగకుండా కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన నాంపల్లి కోర్టు బన్నీకి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో బన్నీని చంచల్ గూడ జైలుకు తరలించారు. అదే సమయంలో హైకోర్టు ఈ కేసును విచారించి బన్నీకి 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.ఇక ఇలా వెళ్లి అలా వచ్చేస్తాడనుకున్న బన్నీకి అక్కడ కూడా షాక్ తగిలింది. కోర్టు ఆదేశాలు తమకు ఇంకా అందలేదని జైలు అధికారులు రాత్రంతా బన్నీని జైల్లోనే పెట్టారు. ఇది మరింత సంచలనం అయింది. రాత్రంతా బన్నీ జైల్లో కిందనే పడుకున్నడని వార్తలు వచ్చాయి. మరుసటి రోజు బన్నీ బయటకొచ్చాడు.

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో చట్టం తన పని తాను చేసుకుపోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ కొట్టిన సిక్సర్ తో టాలీవుడ్ చిత్రపరిశ్రమ షేక్ అవుతోంది. ఒక మంత్రిపైనే.. ఒక సినిమా హీరో ఆ మంత్రి, పార్టీ అధ్యక్షుడు క్షమాపణలు చెప్పాక కూడా రాజకీయ ప్రత్యర్థితో కలిసి పోరాటం చేస్తున్నాడంటే టాలీవుడ్ చిత్రపరిశ్రమ ఈ ప్రభుత్వంతో యుద్ధం కోరుకుంటుందా? స్నేహం కోరుకుంటుందా? అన్నది స్పష్టమవుతోంది. కొన్నిసినిమా కుటుంబాలు రాజకీయ ప్రత్యర్థులతో అతి స్నేహసంబంధాలు కొనసాగిస్తున్నాయి. మా చిత్రపరిశ్రమ రాజకీయాలకు అతీతంగా చెప్పే పెద్దలు లేకపోవడం, ప్రభుత్వం నియమించిన పెద్దను గౌరవించకపోవడంతో కోరి సమస్యలు తగ్గించుకుంటున్నారు. రూ.2లక్షల కోట్ల బడ్జెట్ లో ఈ చిత్రపరిశ్రమ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.500కోట్ల లోపే. దానిపై ప్రభుత్వానికి కక్ష ఉంటుందని తాను అనుకోవడం లేదని ప్రముఖ సినీదర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. పరిశ్రమ ఒక్కటిగా లేకపోవడం వల్లే సమస్యలొస్తుండగా, ఇప్పటికైనా చట్టాన్ని గౌరవించకుంటే.. మరిన్ని బౌండరీలు, సిక్సర్లు కొట్టేందుకు రెడీగా ఉన్నామని ప్రభుత్వం హెచ్చరికలు పంపుతోంది. ఆకస్మికంగా అల్లు అర్జున్ అరెస్ట్, మోహన్ బాబు ఎపిసోడ్, గతంలో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత ఇలాంటివన్నీ టాలీవుడ్ ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

**వరుస సమస్యలు**

వివాదాలతో.. టాలీవుడ్ షేక్ అవుతోంది. ప్రభుత్వానికి ప్రతీ అంశంపైనా నివేదిక ఉంటుంది. అల్లు అర్జున్ అంశంలో వైసిపి, బిఆర్ఎస్ భుజానికెత్తుకుని స్పందించాయి. బిజెపి నేతలు కూడా దీనిపై స్పందించారు. జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ దీనిపై ఎలాంటి కామెంట్ చేయలేదు రాష్ట్ర విభజన తర్వాత కొందరు కథానాయకులు కూడా.. పార్టీల వారీగా విడిపోగా, భవిష్యత్ పరిణామాలు ఊహించకుండా సున్నితమైన లైన్ ను దాటేశారు. ప్రభాస్, మహేష్ బాబు లాంటి వారు అందరివారుగా ఉంటున్నా, పెద్దరికం లేకపోవడం అసలు సమస్యగా ఉంది. ఓవైపు మంత్రిపైనే కథానాయకుడి పోరాటం.. మరోవైపు చంచల్ గూడ జైలుకు వేయికోట్ల సినిమా హీరో. రోడ్డెక్కుతున్న సినిమా కుటుంబాలపై.. తన పని తాను చేసుకుపోతున్నప్రభుత్వాలు. రాజకీయ ప్రభావం నుండి బయటకు రాని సినిమా కుటుంబాలు తగ్గేదేలే అంటుండగా, మా ప్రజాప్రభుత్వం కూడా తప్పుచేసిన వారి విషయంలో తగ్గేదేలే అంటున్నారు ప్రభుత్వపెద్దలు. ఈ ఏడాదిలో ఎన్నో సంఘటనలు. కొన్ని సంఘటనలు.. వారికి సంబంధం లేకపోయినా రాజకీయ నాయకుల అతి జోక్యం వల్ల మంచి కుటుంబాలు ఇబ్బందుల పాలు అవుతున్నాయి. ఒకప్పుడు సినిమా కుటుంబాన్ని టచ్ చేయాలంటే.. ప్రభుత్వాలు ఎంతో ఆలోచించేవి. కానీ ఇపుడు పాన్ ఇండియా స్థాయికి వెళ్ళినా, అలా వచ్చి ఇలా తీసుకెళ్ళిపోతున్నారు. ఇందుకు ఐక్యతాలోపమే కారణం. దిల్ రాజు లాంటి దిగ్గజ నిర్మాతను ఎఫ్ డిసి ఛైర్మన్ గా చేసినా చిత్రపరిశ్రమ పూర్తిస్థాయిలో స్పందించకపోవడంపై ప్రభుత్వవర్గాలు విస్మయం చెందాయి.

**అక్కినేని ఫ్యామిలీపై మంత్రి సురేఖ సంచలన ఆరోపణలు**

నాగ చైతన్య సమంత విడిపోవడానికి కేటీఆరే కారణం అంటూ మంత్రి సురేఖ చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. గతంలో కేటీఆర్‌నాగార్జున మధ్య ఒక డీలింగ్ కుదిరిందన్నారు. ఎన్ కన్వెన్షన్ జోలికి రాకుండా ఉండాలంటే సమంతను తన దగ్గరకు పంపాలని కేటీఆర్ నాగార్జునతో చెప్పారని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై సినీ ఇండస్ట్రీ నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఒక మంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమంటూ సినీ ఇండస్ట్రీ ప్రముఖులు ఖండించారు. వెంటనే మంత్రి సురేఖ క్షమాపణలు చెప్పాలంటూ పలువురు డిమాండ్ చేశారు. దీంతో సమంతకు.. మంత్రి సురేఖ క్షమాపణలు చెప్పింది. మరోవైపు నాగార్జు, కేటీఆర్ వేరు వేరుగా ఆమెపై పరువునష్టం దావా వేశారు. ఒక మంత్రి స్థాయిలో ఉండి సురేఖ తన ఫ్యామిలీపై తీవ్ర ఆరోపణలు చేశారని నాగార్జున కోర్టులో ఆవేదన చెందారు. సమాజంలో తమ ఫ్యామిలీకి ఎంతో పరువు ప్రతిష్ట ఉందన్నారు. ఆమె వ్యాఖ్యలతో వాటికి భంగం కలిగిందని భావోద్వేగానికి గురయ్యారు. దీంతో కోర్టు ఆమెకు వార్నింగ్ ఇచ్చింది. ఇంకెప్పుడూ ఇలాంటి ఆరోపణలు చేయరాదని కోర్టు పేర్కొంది. మరోవైపు సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆమె ఆరోపణల వీడియోలు డిలీట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మంత్రి సురేఖ క్షమాపణలు చెప్పినా, పిసిసి అధ్యక్షుడు విచారం వ్యక్తం చేసినా నాగార్జున కోర్టులో పోరాటం కొనసాగిస్తున్నాడు. ఒక మంత్రిపై హీరో పోరాటం కొనసాగిస్తున్నాడంటే.. ప్రభుత్వానికి అది సవాలే. ఇదే అంశంపై ప్రతిపక్ష నేత కేటీఆర్ కూడా మంత్రిపై పరువునష్టం దావా వేశారు.

**ఎన్టీఆర్ 'దేవర' ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నో పర్మిషన్**

దీని అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఇండస్ట్రీలోని స్టార్ హీరో సినిమాకు భారీ షాక్ ఇచ్చింది. జూ. ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాకు ఊహించని దెబ్బ కొట్టింది. ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ఊహించని రీతిలో రద్దయింది. ముందుగా ఈ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు పర్మిషన్ కోరితే ప్రభుత్వం నిరాకరించింది. దీంతో హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఈవెంట్ నిర్వహించగా జనం భారీగా తరలి రావడంతో హోటల్ అద్దాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు తారక్ ఫ్యాన్స్‌పై లాఠీ ఛార్జ్ చేశారు.

**బాలకృష్ణకు రేవంత్ సర్కార్ షాక్**

సీఎం రేవంత్ రెడ్డి మరో నిర్ణయం బాలయ్యను ప్రభావితం చేస్తోంది. రోడ్డు విస్తరణలో భాగంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ సమీపంలో ఉన్న బాలయ్య నివాసానికి ముప్పు పొంచి ఉంది. ఫిల్మ్‌నగర్ రోడ్ నంబర్ 45లోని బాలకృష్ణ ఇంటికి 6 అడుగుల మేర జీహెచ్ఎంసీ అధికారులు మార్కింగ్ వేశారు. దీంతో బాలయ్య ఇంటికి సంబంధించి జిహెచ్ ఎంసి అధికారులు 6 అడుగుల మేర నేలమట్టం చేయనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. బాలకృష్ణ సీఎం రేవంత్ రెడ్డి మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ ఏడాది హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో బసవతారకం హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సీఎం కాకముందు ఓ సినిమా ఫంక్షన్లోనూ బాలయ్యపై రేవంత్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో బాలయ్య విషయంలో రేవంత్ సర్కార్ వ్యవహారం ఎలా ఉండబోతుందనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది.

**మోహన్ బాబు ఎపిసోడ్**

తెలుగు సినీ పరిశ్రమలో ఉన్న స్టార్ కుటుంబాలలో మంచు ఫ్యామిలీ ఒకటి. తాజాగా ఈ ఫ్యామిలీ వారి కుటుంబ సమస్యలతో వార్తల్లో నిలిచింది. నటుడు మంచు మోహన్ బాబు అతని కుమారుడు మంచు మనోజ్‌ల మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై జల్‌పల్లిలో ఉన్న మోహన్ బాబు ఇంటిపైకి బౌన్సర్లతో వెళ్లి దాడి చేశాడు మంచు మనోజ్. అయితే ఈ గొడవల జరుగుతున్న నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేశాడు. ఈ దాడి ఘటనలో గాయపడ్డ జర్నలిస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఈ ఘటనతో ఆగ్రహించిన జర్నలిస్ట్ సంఘాలు.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో దాడి ఘటనలో గాయపడిన జర్నలిస్ట్‌కు మోహన్‌బాబు ఎట్టకేలకు క్షమాపణలు చెప్పారు. కుటుంబ వివాదం ఘర్షణకు దారి తీసినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్ట్ సోదరుడు గాయపడటం తనకు బాధ కలిగించిందని అన్నారు. అయితే మీడియాపై మోహన్ బాబుదాడి కేసు సర్వత్రా చర్చనీయాంశమవడమే కాకుండా ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనలో మోహన్ బాబుపై ఇప్పటికే హత్యాయత్నం కేసు కూడా నమోదైంది. అరెస్ట్ జరగొచ్చన్న ప్రచారమూ ఉంది.

### నాగార్జున ఎన్ కన్వెన్షన్ నేలమట్టం

మొదటగా సీఎం రేవంత్ హైడ్రా ప్రవేశ పెట్టి అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టించారు. పేద ధనిక అనే తారతమ్యం లేకుండా అందరినీ ఒకేలా చూశారు. హైడ్రా పేరుతో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ హైడ్రా బాదితుల్లో సినీ ఇండస్ట్రీ నుంచి అక్కినేని నాగార్జున ఒకరు. మొదట్లోనే హైడ్రా పేరుతో నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్‌ను నేలమట్టం చేసి సంచలనం సృష్టించారు. మాదాపూర్ లోని ఒక చెరువును కబ్జా చేసి నాగార్జున ఎన్ కన్వెన్షన్ అక్రమంగా నిర్మించారని హైడ్రా అధికారులు గుర్తించారు. దీంతో బుల్డోజర్‌ను మొదటిగా నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ పైకి పంపించి దాన్ని నేలమట్టం చేశారు. దీంతో నాగార్జున కోర్టు మెట్లు ఎక్కినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను కొందరు సమర్థించారు. సీఎం అంటే ఇలానే ఉండాలి అంటూ పొగడ్తలు కురిపించారు.

## నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో లేను

### పార్టీ నాకు పెద్ద బాధ్యతలు అప్పగించింది

### నాకు పార్టీ పగ్గాలనేది ఊహాగానాలే

### అధ్యక్షుడు ఎవరనేది హైకమాండ్ దే తుది నిర్ణయం

**హైదరాబాద్, మహా :** బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులోనే తాను లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పార్టీ నాయకత్వం తనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పెద్ద బాధ్యతలను అప్పగించిందన్నారు. ఆ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించేందుకు తాను చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నానని చెప్పారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగిస్తారని వస్తున్న వార్తలు, జరుగుతున్న ప్రచారమంతా ఊహాగానాలేనని కొట్టిపారేశారు. పార్టీ నాయకత్వం అసలు రాష్ట్ర అధ్యక్ష పదవిపై దృష్టి సారించనేలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్ష నియామకం విషయంలో బీజేపీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే ఫైనల్ అని, అందరూ దానికి కట్టుబడి ఉండాలని కోరారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) కరీంనగర్ జిల్లా ఎన్నికల్లో ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులు కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గెలిచిన నాయకులందరికీ పేరు పేరునా అభినందనలు తెలిపడంతోపాటు ఘనంగా సన్మానించారు. నూతన టీం జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమానికి క్రుషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు భారతీయ జనతా పార్టీలో పోలింగ్ అధ్యక్షుడి నుండి జాతీయ అధ్యక్ష నియామకం వరకు సమిష్టి నిర్ణయాల మేరకే జరుగుతాయి. ప్రస్తుతం సంస్థాగత ఎన్నికలు జరుగుతున్నాయి. ఇంకా జిల్లా, రాష్ట్ర అధ్యక్ష నియామకాల అంశమే చర్చకు రాలేదు. నాపై అభిమానంతో కొందరు ప్రచారం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం నాకు హోంశాఖ సహాయ మంత్రిగా పెద్ద బాధ్యతలు అప్పగించింది. సమర్ధవంతంగా నిర్వర్తించి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నా. అంతే తప్ప నేను రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులోనే లేను. జరుగుతున్న ప్రచారమంతా ఊహగానాలే.మీడియా ఇలాంటి వార్తలు రాయడంవల్ల కొందరు కావాలనే నాకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారు. అసలు నేను అధ్యక్ష రేసులోనే లేను. హైకమాండ్ ఆ నిర్ణయం కూడా తీసుకోలేదు. దయచేసి మీడియా, సోషల్ మీడియా మిత్రులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నా...ఇలాంటి కథనాలతో పార్టీకి నష్టం జరిగే ప్రమాదముంది. అట్లాగే వ్యక్తిగతంగా నాకు కూడా నష్టం జరిగే అవకాశముంది. దయచేసి ఇకపై అలాంటి కథనాలు రాయొద్దని కోరుతున్నా. రాష్ట్ర అధ్యక్ష నియామకం విషయంలో బీజేపీ హైకమాండ్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. ప్రతి ఒక్కరూ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరుతున్నా. అని సంజయ్ తెలిపారు.



## పవన్‌కల్యాణ్‌కు వివాహా ఆహ్వాన పత్రికను అందజేసిన పీవీ సింధు



**అమరావతి :** ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఆదివారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌ను కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆమె వెంట తండ్రి పి.వి. రమణ ఉన్నారు. పీవీ సింధూ ఈనెల 22న ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకోనున్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వెంకట దత్తసాయిని ఆమె వివాహం చేసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమె దేశంలోని ప్రముఖ క్రీడాకారులకు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు , ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులకు ఆహ్వాన పత్రికను అందజేశారు.



# భూషణ్ స్టీల్‌కు భారీ ఊరట

**న్యూఢిల్లీ :** జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన భూషణ్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు భారీ ఊరట లభించింది. సుప్రీంఆదేశాలకు అనుగుణంగా ఈడీ జప్తు చేసిన రూ.4,025 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించింది. కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రకారం దివాలాఐబీసీ కింద దివాల తీసిన కంపెనీ ఆస్తులను జేఎస్‌డబ్ల్యూ సరైన పరిష్కారం చూపించడంతో ఈడీ ఈ నిర్ణయం తీసుకున్నది. భూషణ్ స్టీల్‌కు చెందిన ఈ ఆస్తులను పీఎంఎల్ఏ చట్ట ప్రకారం గతంలో ఈడీ జప్తు చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ సూచనల మేరకు ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

సుజుకి ఈవిటారా నుంచి టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ..

## జనవరిలో భారత్ మార్కెట్లో ఆవిష్కరణ..!




ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్.. బ్రిటన్ మార్కెట్లో తన అర్బన్ క్రూయిజర్ ఈవీ కారును ఆవిష్కరించింది. సుజుకి మోటార్స్ ఈవిటారా బ్యాడ్జితో రూపుదిద్దుకున్నదీ అర్బన్ క్రూయిజర్ ఈవీ. ఈ ఏడాది ప్రారంభంలో సుజుకి ఈవిటారా ఆవిష్కరించారు. టయోటా, మారుతి సుజుకిల నుంచి వస్తున్న రెండు ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కార్లు వచ్చేనెలలో భారత్ ఎక్స్ పోలో ప్రదర్శించనున్నారు. మారుతి సుజుకి, టయోటా మధ్య టెక్నాలజీ మార్పిడి ఒప్పందం ఉన్న సంగతి తెలిసిందే. సుజుకి ఈవీఎక్స్ కాన్సెప్ట్ ఆధారంగా రూపుదిద్దుకున్నదే టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ. గుజరాత్ లోని మారుతి సుజుకి ప్లాంట్ లో టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ / సుజుకి ఈ విటారా తయారవుతాయి. తొలుత భారత్ మార్కెట్లో మారుతి సుజుకి తన ఈవిటారా కారును ఆవిష్కరిస్తుంది. అటుపై టయోటా తన అర్బన్ క్రూయిజర్ ఈవీ కారును మార్కెట్లోకి తీసుకొస్తుంది. అర్బన్ క్రూయిజర్ ఈవీ, ఈవిటారా కార్లు - బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ (బీఈవీ) డెడికెటేడ్ ఫ్లాట్ ఫామ్ ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. హై ఓల్టేజ్ భాగాల నుంచి రక్షణ కల్పిస్తూ ఈ రెండు కార్లను నిర్మించారు. టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ కారు స్లీక్ ఫ్రంట్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్ , ఎల్ఇడీ టెయిల్ ల్యాంప్స్ తోపాటు ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, మస్క్యులర్ ఫ్రంట్ అండ్ రేర్ బంపర్లు, 18/19 అంగుళాల వీల్స్ ఉంటాయి.

# గోల్డ్ ర్యాలీకి బ్రేక్?

## వచ్చే ఏడాది ధరల పెరుగుదల అంతంతే

### ట్రంప్ రాకతో వాణిజ్య యుద్ధాలు.. వృద్ధిరేటు, డిమాండ్ పతనం: డబ్ల్యూజీసీ

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది జోరుగా పెరిగిన బంగారం ధరలు.. వచ్చే ఏడాదిలో మాత్రం నెమ్మదించవచ్చని చెప్తున్నది ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ). మునుపెన్నడూ లేనివిధంగా దేశంలో పసిడి ధర ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఆల్‌టైమ్ హైకి చేరిన విషయం తెలిసిందే. తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు గరిష్ఠంగా రూ.82,400 పలికింది. అయితే అక్టోబర్ ఆఖరుదాకా పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. గత నెలన్నర (45 రోజులు)గా పడుతూ.. లేస్తూ.. సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూజీసీ తాజా అంచనాలు సైతం ప్రస్తుత మార్కెట్ తీరుకు అనుగుణంగానే ఉన్నాయి. కొత్త ఏడాదిలోనూ మార్కెట్ ట్రెండ్ ఇదే రీతిలో ఉండవచ్చన్న అభిప్రాయాన్ని 2025 ఔట్‌లుక్‌లో వ్యక్తం చేసింది.

**30 శాతానికిపైగానే..**

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు 30 శాతానికిపైగా పుంజుకున్నాయి. సెంట్రల్ బ్యాంకులు, ముఖ్యంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా బంగారం కొనుగోళ్లకు పెద్దపీట వేసింది. ఆర్బీఐ సైతం గోల్డ్ రిజర్వులకు అత్యంత ప్రాధాన్యాన్నిస్తున్న సంగతి విదితమే. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పోరు, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధానం వంటివి స్టాక్ మార్కెట్లను కుంగదీశాయి. ఫలితంగా మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం ప్రత్యామ్నాయ మార్గమైన పసిడి వైపు చూశారు. దీంతో ఈ ఏడాది గోల్డ్ మార్కెట్‌లో డిమాండ్ ఊహించనివిధంగా పెరిగిపోయింది. ఇది ధరలను పరుగులు పెట్టించింది. మరోవైపు పండుగ సీజన్లు, పెండ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి.

**ఇదీ సంగతి..**

బంగారం ధరలు వచ్చే ఏడాది ఈ స్థాయిలో పెరగకపోవచ్చని డబ్ల్యూజీసీ తాజాగా పేర్కొన్నది. జీడీపీ వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు గోల్డ్ మార్కెట్ క్రయవిక్రయాలను ప్రభావితం చేయవచ్చని అంటున్నది. జనవరిలో అమెరికాకు రాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు వాణిజ్య యుద్ధాలకు తెర లేపవచ్చన్న ఆందోళనల్ని కనబర్చింది మరి. పరస్పర సుంకాలతో మదుపరులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు దూరం కావచ్చని, దీంతో ఆయా దేశాల జీడీపీ, విపణిలో డిమాండ్ పడిపోవచ్చని హెచ్చరించడం గమనార్హం. కానీ ఇప్పటికైతే బంగారం ధరలు అంతర్జాతీయంగా గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. ఔన్స్ 2,700 డాలర్ల సమీపంలో ఉన్నది. ఇక గోల్డ్‌మన్ సాచ్స్ గ్రూప్ వచ్చే ఏడాది ఆఖర్లో 3,000 డాలర్లకు పోవచ్చంటున్నది. యూబీఎస్ ఏజీ అంచనా 2,900 డాలర్లుగా ఉన్నది.

**మరో రూ.1,000 డౌన్**

బంగారం ధరలు శనివారం మరింత తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.980 దిగి రూ.77,890గా నమోదైంది. 22 క్యారెట్ రూ.900 పడిపోయి రూ.71,400 పలికింది. మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడమే కారణమని వ్యాపారులు చెప్తున్నారు. కాగా, శుక్రవారం కూడా ధరలు బాగా తగ్గిన విషయం తెలిసిందే. ఢిల్లీలో ఒక్కరోజే 24 క్యారెట్ తులం రూ.1,400 క్షీణించింది. ఇక వెండి కిలో ధర ఏకంగా రూ.4,200 పతనమై రూ.92,800 వద్దకు పరిమితమైంది. ఈ ఏడాది కిలో ధర లక్షా 2 వేల రూపాయల ఆల్‌టైమ్ హైని తాకినది తెలిసిందే.





# పెట్టుబడుల వరద

**డాటా సెంటర్లలోకి రెండేండ్లలో 100 బిలియన్ డాలర్లు: సీబీఆర్ఈ**

**న్యూఢిల్లీ :** పెట్టుబడులను ఆకర్శించడంలో డాటా సెంటర్లు దూసుకుపోతున్నాయి. 2027 నాటికి డాటా సెంటర్ల విభాగంలోకి 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నదని సీబీఆర్ఈ అంచనావేస్తున్నది. అలాగే డాటా సెంటర్ల కెపాసిటీ 2070 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. ప్రస్తుతం 1,255 మెగావాట్ల స్థాయిలో ఉన్న డాటా సెంటర్ల సామర్థ్యం..ఈ ఏడాది చివరినాటికి 1,600 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. గడిచిన ఆరేండ్లలో 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్శించిన దేశీయ డాటా సెంటర్ల విభాగం..వచ్చే మూడేండ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని సీబీఆర్ఈ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం 19 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో డాటా సెంటర్లు నిర్వహిస్తుండగా, వచ్చే ఏడాది చివరినాటికి ఇది 31 మిలియన్ చదరపు అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది. అలాగే 475 మెగావాట్ల డాటా సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వచ్చే కొన్ని నెలల్లో ఇవి అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపింది. బీఎఫ్ఎస్ఐ, టెక్నాలజీ, టెలికం రంగాల నుంచి డాటా సెంటర్లకు డిమాండ్ ఉంటుందని తెలిపింది.

## అంతర్జాతీయ సంస్థలు కూడా..

దేశీయ డాటా సెంటర్లలోకి అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వీటితోపాటు రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు కూడా భారీగా నిధులు చొప్పించడానికి సిద్ధమవుతున్నాయి. డాటా సెంటర్ల నిర్వహణలో ముంబై తొలిస్థానం నిలిచింది. ఆ తర్వాతి క్రమంలో చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులు ఉన్నాయి.

# క్రీడా వార్తలు SPORTS NEWS



# తెలంగాణ, రాజస్థాన్ పోరు డ్రా

## సంతోశ్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక సంతోశ్ ట్రోఫీ ఫుట్ బాల్ టోర్నీలో ఆతిథ్య తెలంగాణకు డ్రా ఎదురైంది. శనివారం స్థానిక శ్రీనిధి దక్కన్ ఎరీనాలో తెలంగాణ, రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ 11తో డ్రాగా ముగిసింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేశాయి. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో మణిపూర్ 10తో సర్వీసెస్‌పై గెలిచి బోణీ కొట్టింది. తెలంగాణ, రాజస్థాన్ మ్యాచ్‌ను సాట్స్ చైర్మన్ శివాసేనారెడ్డి అధికారికంగా ప్రారంభించారు. 57 ఏండ్ల తర్వాత సంతోశ్ ట్రోఫీకి తెలంగాణ ఆతిథ్యమిస్తున్నది.




# రోహిత్ శర్మ కెప్టెన్సీపై అభిమానుల గుస్సా..!

## సోషల్ మీడియాలో దారుణంగా ట్రోలింగ్..!

భారత కెప్టెన్ రోహిత్ శర్మ కెప్టెన్సీపై మరోసారి చర్చ సాగుతున్నది. పేలవమైన కెప్టెన్సీపై సోషల్ మీడియా వేదికగా మరోసారి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో రోహిత్ కెప్టెన్సీపై విమర్శలు గుప్పిస్తున్నారు. మూడో టెస్ట్ రెండురోజు తొలి సెషన్‌లోనే టీమిండియా శుభారంభం చేసింది. తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా. అయితే, ఆ తర్వాత ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈ క్రమంలోనే ఇద్దరు సెంచరీలు సాధించారు. ఆస్ట్రేలియా స్కోరు 317 వద్ద నాలుగో దెబ్బకు తగిలింది. స్టీవ్ స్మిత్ పెవిలియన్‌కు చేరాడు. 75 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియాను స్మిత్-హెడ్ జోడీ 317 పరుగుల వరకు తీసుకెళ్లారు. నాలుగో వికెట్‌కు 242 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. భారత్‌తో టెస్టులో ఆస్ట్రేలియాకు ఇది నాలుగో అత్యుత్తమ భాగస్వామ్యం కావడం విశేషం. స్మిత్, హెడ్ ఇద్దరూ కలిసి టీమిండియా బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ స్మిత్ ఇచ్చిన ఓ క్యాచ్‌ను సైతం మిస్ చేశాడు. నాలుగో వికెట్‌కు ఈ జోడీ భాగస్వామ్యం నెలకొల్పిన నేపథ్యంలో టీమిండియా అభిమానులు హిట్ మ్యాన్ కెప్టెన్సీపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రోహిత్ నిర్ణయాన్ని సైతం అభిమానులు విమర్శించారు. అదే సమయంలో మ్యాచ్‌లో రోహిత్ అనుసరించిన వ్యూహాలపై సైతం విమర్శలు గుర్పించారు. స్మిత్, ట్రావిస్ హెడ్ బ్యాటింగ్ సమయంలోనూ సరిగ్గా ఫీల్డింగ్ సెట్ చేకపోవడంతో పరిస్థితిని ఇద్దరూ బ్యాటర్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారని విమర్శించారు. అభిమానులతో పాటు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సైతం రోహిత్ కెప్టెన్సీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెడ్ బ్యాటింగ్ సమయంలో అల్ట్రా డిఫెన్సివ్ ఫీల్డ్‌ని సెట్ చేశాడని.. అది పేలవంగా ఉందంటూ విమర్శించారు. ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ సైతం రవిశాస్త్రితో ఏకీభవించాడు. ట్రావిస్ హెడ్‌పై దూకుడుగా వైఖరిని అవలంభించాల్సి ఉందని చెప్పాడు. మరో వైపు మాజీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, సంజయ్ బంగార్ సైతం రోహిత్ వ్యూహాలపై విమర్శలు గుప్పించారు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టును భారీ స్కోరు దిశగా నడిపించిన ఈ మ్యాచ్‌లో రోహిత్ ప్లాన్ ఇప్పటి వరకు ఫలించలేదన్నారు. ట్రావిస్ హెడ్ వరుసగా టీమిండియాపై రెండో సెంచరీ సాధించగా.. స్మిత్ సైతం 17 నెలల తర్వాత టెస్టుల్లో తొలి సెంచరీను నమోదు చేశాడు. ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది.

# బ్రిస్బేన్ టెస్ట్‌లో భారీ స్కోర్ దిశగా ఆస్ట్రేలియా..

**రెండురోజు ఆటముగిసే సరికి సోర్క్ 405/7**



బోర్డర్‌గవాస్కర్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాటీమిండియా మధ్య బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ స్కోర్ దిశగా దూసుకువెళ్తున్నది. తొలిరోజు వర్షం కారణంగా కేవలం 13.2 ఓవర్లు మాత్రమే ఆట సాధ్యమైన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్ ఏడు పరుగులతో, అలెక్స్ కారీ 45 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. ట్రావిస్ హెడ్ 152 పరుగులు, స్టీవ్ స్మిత్ 101 పరుగులు చేశారు. మరోవైపు, భారత్ తరఫున జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు.

ఉదయం 28 పరుగుల వద్ద ఆస్ట్రేలియా రెండోరోజు బ్యాటింగ్ మొదలుపెట్టింది. ఆదివారం 377 పరుగులు చేసి ఏడు వికెట్లు కోల్పోయింది. తొలి సెషన్‌లో ఉస్మాన్ ఖవాజా (21), నాథన్ మెక్‌స్వీనీ (9)లను బుమ్రా పెవిలియన్‌కు పంపి ఆసిస్‌కు షాక్ ఇచ్చారు. ఆ తర్వాత మార్నస్ లాబుస్‌చగ్నే (12)ను నితీశ్‌రెడ్డి అవుట్ చేశాడు. ఆ తర్వాత, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ జోడీ రెండో సెషన్‌లో టీమిండియాకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తపడుతూ వీలు చిక్కినప్పుడల్లా పరుగులు తీశారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 242 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

హెడ్ టెస్ట్ కెరీర్‌లో తొమ్మిదో సెంచరీని సాధించాడు. స్టీవ్ స్మిత్ 33వ సెంచరీని నమోదు చేశాడు. 190 బంతుల్లో 12 ఫోర్ల సాయంతో 101 పరుగులు చేసిన స్మిత్ అవుట్ అయ్యాడు. ఆ తర్వాత 160 బంతుల్లో 18 ఫోర్ల సాయంతో 152 పరుగులు చేసి ట్రావిస్ హెడ్ పెవిలియన్ బాటపట్టాడు. ఐదు పరుగుల వద్ద మిచెల్ మార్ష్, 20 పరుగుల వద్ద కెప్టెన్ పాట్ కమిన్స్ అవుట్ అయ్యారు. ఏడో వికెట్‌కు కారీతో కలిసి కమిన్స్ 58 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. టీమిండియా మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మరోసారి ఐదు వికెట్లు పడగొట్టగా..సిరాజ్, నితీశ్‌రెడ్డిలకు చెరో వికెట్ దక్కింది.



# హైప్ పెంచేస్తున్న అనుష్క ఘాటి



టాలీవుడ్‌తోపాటు పాన్ ఇండియా స్థాయి ఇమేజ్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది అనుష్కా శెట్టి. చాలా రోజుల తర్వాత స్వీటీ కాంపౌండ్ నుంచి వస్తోన్న ప్రాజెక్ట్ ఘాటి. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే ఈ మూవీ విడుదల తేదీని నేడు ప్రకటించబోతున్నట్టు చిత్రయూనిట్ వెల్లడించింది. నేరస్థురాలిగా మారిన ఓ బాధితురాలు ప్రతీకారాన్ని ఎలా తీర్చుకుందనే నేపథ్యంలో ఘాటి ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఇటీవలే ఈ మూవీ నుంచి జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తోపాటు గ్లింప్స్ సోషల్ మీడియాలో సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.



# మెగాస్టార్ చిరంజీవితో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్..


టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జైలు నుంచి విడుదలైన అనంతరం మొదటిసారిగా చిరంజీవి ఇంటికి వెళ్లిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నివాసానికి బన్నీనే స్వయంగా కారు నడుపుకుంటూ తన ఫ్యామిలీతో కలిసి వెళ్లాడు. ఇక మెగాస్టార్ ఇంట్లో దాదాపు గంటన్నరసేపు గడిపిన అల్లు అర్జున్ చిరంజీవి ఫ్యామిలీతో కలిసి లంచ్ చేశాడు. అనంతరం తన అరెస్ట్‌కు సంబంధించి కేసు ఘటనపై చిరు అల్లు అర్జున్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నాడు. కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్న చిరు అనంతరం బన్నీకి న్యాయపరమైన సలహాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. అల్లు అర్జున్ బయటికి రావడానికి లాయర్ నిరంజన్ రెడ్డి కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ కోసం నిరంజన్ రెడ్డి వాదించడంలో చిరుతో పాటు ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ కీలక పాత్ర పోషించాడు.

# ఆ వ్యక్తి ఎవరో?

'పుష్ప-3' చిత్రంలో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించే అవకాశం ఉందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. కొన్నేళ్ల క్రితం విజయ్ దేవరకొండ చేసిన ఓ పోస్ట్‌ను ఉటంకిస్తూ ఈ వార్తను వైరల్ చేస్తున్నారు. 'పుష్ప-2' క్లైమాక్స్‌లో పుష్పరాజ్‌పై ఓ అపరిచిత వ్యక్తి బాంబు దాడికి పాల్పడినట్లుగా చూపించారు. అతను విజయ్ దేవరకొండ అని వార్తలొస్తున్నాయి. తాజాగా ఈ విషయంపై అగ్ర కథానాయిక రష్మిక మందన్న స్పందించింది. ఆమె మాట్లాడుతూ 'దర్శకుడు సుకుమార్ ప్రతీ విషయంలో చివరి వరకూ సస్పెన్స్‌ను కొనసాగిస్తారు. 'పుష్ప-2' క్లైమాక్స్‌లో ఆ సీన్‌ను చూసి నేను కూడా ఆశ్చర్యపోయా. ఆ బాంబు విసిరిన వ్యక్తి ఎవరో తెలుసుకోవాలనే ఉత్సుకత పెరిగింది. నేను కూడా మీలాగే ఆ వ్యక్తి ఎవరో కనిపెట్టాలనుకుంటున్నా' అని చెప్పింది. గత వారం ప్రేక్షకుల ముందుకొచ్చిన 'పుష్ప-2' చిత్రం ఇప్పటికే 1000కోట్ల వసూళ్ల మైలురాయిని దాటి దూసుకుపోతున్నది. ఈ సినిమాలో శ్రీవల్లిగా రష్మిక మందన్న పాత్ర అందరిని ఆకట్టుకుంటున్నది.



# దర్శకుడిగా ఆయనే స్ఫూర్తి



దర్శకుడిగా ఎందరికో స్ఫూర్తినిచ్చారు రాజమౌళి. మరి ఆయనకు స్ఫూర్తినిచ్చింది ఎవరు? అనే విషయం మాత్రం చాలామందికి తెలియదు. డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు ప్రభావం తనపై ఉందని పలు సందర్భాల్లో రాజమౌళి చెప్పారు. అలాగే ఆయన్ని ప్రభావితం చేసిన దర్శకుడు వేరొకరున్నారు. ఆయనే విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీరామారావు. ఇటీవల ఓ టాక్‌షోలో ఈ విషయాన్ని వెల్లడించారు రాజమౌళి. 'సినీ దర్శకుడిగా నేను ఎక్కడినుంచి స్ఫూర్తి పొందానో చెప్పడం కష్టం. చిన్నప్పట్నుంచీ చదివిన పుస్తకాలు, చూసిన సినిమాలు, కుటుంబంలోని వ్యక్తులతో జరిగిన చర్చలు. ఇవన్నీ లావాగా మారి నాలోని సృజనను రగిలించి ఉండొచ్చు. ముఖ్యంగా నేను నందమూరి తారక రామారావుగారి వీరాభిమానిని. ఆయన సినిమాలు చిన్నప్పట్నుంచీ ఎక్కువగా చూసేవాడ్ని. అందరికీ ఆయన మహానటుడిగానే ఎక్కువగా తెలుసు. కానీ ఆయన మహా దర్శకుడు కూడా. తనకు తెలిసిన విషయాన్ని జనం మెచ్చేలా మార్చగలననే నమ్మకం ఆయన దర్శకత్వంలో పుష్కలంగా కనిపిస్తుంది. అందుకే దర్శకుడిగా క్లాసిక్స్ తీశారు. ఆయన ప్రభావం కూడా నాపై ఉంది' అని తెలిపారు.



# న్యూ ఇయర్‌లో ప్రభాస్ కొత్త సినిమా ప్రకటన..?

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ (Prabhas). ఇప్పటికే మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. దీంతోపాటు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సలార్ 2, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ సినిమాను లైన్‌లో పెట్టాడు. మరోవైపు హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ సినిమా కూడా చేస్తున్నాడు. 2024లో వరుస ప్రాజెక్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ప్రభాస్.. 2025లో కూడా ఇదే ట్రెండ్ క్రియేట్ చేయబోతున్నాడా..? అంటే తాజా వార్త ఒకటి అవుననే హింట్ ఇచ్చేస్తుంది. తాజా టాక్ ప్రకారం ప్రభాస్ 2025 ప్రారంభంలో కొత్త సినిమా ప్రారంభించబోతున్నాడన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. అంతేకాదు ఈ చిత్రాన్ని హనుమాన్ ఫేం ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేయబోతున్నాడట. పాపులర్ ప్రొడక్షన్ హౌస్ హోంబలే ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నట్టు సమాచారం. శాండల్‌వుడ్‌లో ఉన్న మల్టీ టాలెంటెడ్ సెలబ్రిటీల్లో ఒకడైన రిషబ్ శెట్టి (Rishab Shetty) ప్రభాస్ సినిమా కోసం కథనందించబోతున్నాడని ఇప్పటికే ఓ వార్త నెట్టింట వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. హోంబలే ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతుందని వార్తలు రావడంతో.. మరి ఈ సినిమా అదేనా..? అంటూ జోరుగా చర్చ మొదలైంది. ఈ ఎక్జయిటింగ్ గాసిప్‌పై న్యూఇయర్‌లో ఏదైనా అధికారిక ప్రకటన చేస్తాడా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. రిషబ్ శెట్టి జై హనుమాన్ సినిమాతోపాటు కాంతార చాప్టర్ 1 (ప్రీక్వెల్)లో నటిస్తున్నాడు.



పిక్ ఆఫ్ ది డే

బీచ్‌లో ఆదివారం బికినీలో మెరిసిపోతున్న దిశా పటానీ

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com



# ఆమె హేళన.. అతడి ఆత్మహత్య

**రోజంతా తింటూ కూర్చొంటున్నావు అన్న సహచరి మాటలతో మనస్తాపం నోయిడాలో నిరుద్యోగి ఆత్మహత్య**

**న్యూఢిల్లీ :** భార్య వేధింపులు భరించలేక బెంగళూరులో ఒక టెకీ ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం సృష్టించిన క్రమంలో తాను సహ జీవనం చేస్తున్న మహిళ నుంచి వేధింపులు, అవహేళనలు భరించలేక యూపీలోని నోయిడాలో నిరుద్యోగ యువకుడొకరు ఆత్మహత్య చేసుకున్నాడు. 'రోజంతా కూర్చుని ఇంట్లో తింటూ కూర్చోకపోతే ఏదైనా పని చూసుకోవచ్చు కదా' అని తనతో సహ జీవనం చేస్తున్న మహిళ నిత్యం ఈసడించేదని, దీంతో ఉద్యోగం దొరక్క, భాగస్వామి నుంచి అవహేళనలు, వెక్కిరింపుల వల్ల కలిగే తీవ్ర మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నానని ఆ యువకుడు పేర్కొన్నాడు. ఈ పరిస్థితికి తాను ఎవరినీ నిందించడం లేదని 27 ఏండ్ల మయాంక్ చాందేల్ తన ఆత్మహత్య నోట్‌లో పేర్కొన్నాడు. యూపీలోని జలాలబాద్‌కు చెందిన మయాంక్ ఒక యువతితో కలిసి చదువుకునే వాడు. తర్వాత వారి పరిచయం ప్రేమగా మారింది. ప్రైవేట్ కంపెనీలో పనిచేసే ఆమెతో అతను గత నాలుగేండ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళతో ఉంటున్న ఫ్లాట్‌లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## సంపన్నులపై పన్నులు పెంచండి

**ఆర్థిక అసమానతలు తగ్గేందుకు ఇదే మార్గం**

**భారత్‌కు ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టి సూచన**



**న్యూఢిల్లీ:** భారత్‌లో ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ధనవంతులపై ఎక్కువ పన్నులు విధించాలని ఫ్రెంచ్ ఆర్థిక వేత్త, 'కాపిటల్ ఇన్ ది ట్వెంటీ ఫస్ట్ సెంచరీ' పుస్తక రచయిత థామస్ పికెట్టి సూచించారు. రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆస్తులు ఉన్న సంపన్నులపై 2 శాతం సంపద పన్ను విధిస్తే దేశ జీడీపీలో 2.73 శాతానికి సమానమైన వార్షిక ఆదాయం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రూ.10 కోట్ల పైన విలువైన ఆస్తులపై 33 శాతం వారసత్వ పన్నును కూడా విధించాలని ఆయన సూచించారు. 202223లో జాతీయ ఆదాయంలో 22.6 శాతం వాటా దేశంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం జనాభాదేనని, దేశం మొత్తం సంపదలో 40.1 శాతం వారి వద్దే ఉందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ జాతీయ ఆదాయంలో అత్యంత ధనికులైన 1 శాతం మంది వాటా విలువ అమెరికా, బ్రెజిల్‌లలోని 1% ధనికుల వాటాను మించిపోయిందని ఆయన అన్నారు. అయితే, పికెట్టి సూచనను ఇదే కార్యక్రమంలో పాల్గొన్న భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ వ్యతిరేకించారు. కాగా, భారత ప్రభుత్వం 2015లో సంపద పన్నును రద్దు చేసింది. వారసత్వ పన్నును తీసుకురావాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పన్ను విధించబోమని ఏప్రిల్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

## బావతో ప్రేమ వ్యవహారం.. పెళ్లైన నాలుగు రోజులకే భర్తను చంపిన మహిళ


**అహ్మదాబాద్:** ఒక మహిళకు తన బావతో ప్రేమ సంబంధం ఉంది. అయితే తల్లిదండ్రుల బలవంతంతో మరో వ్యక్తితో పెళ్లి జరిగింది. ఈ నేపథ్యంలో పెళ్లైన నాలుగు రోజులకే ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. అహ్మదాబాద్‌కు చెందిన భావిక్‌కు, గాంధీనగర్‌కు చెందిన పాయల్‌తో ఇటీవల వివాహం జరిగింది. భార్యను తన ఇంటికి తీసుకువచ్చేందుకు శనివారం బైక్‌పై అత్తవారింటికి బయలుదేరాడు. కాగా, భావిక్ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం, ఇంటికి చేరకపోవడంతో అతడి తండ్రికి పాయల్ తండ్రి ఫోన్ చేశాడు. తమ ఇంటికే అతడు బయలుదేరినట్లు తెలిసి ఆ కుటుంబమంతా వెతికారు. ఒకచోట రోడ్డుపై పడి ఉన్న భావిక్ బైక్‌ను గుర్తించారు. అయితే వాహనంలో వచ్చిన వ్యక్తులు అతడి బైక్‌ను ఢీకొట్టి కిడ్నాప్ చేసినట్లు స్థానిక వ్యక్తి తెలిపాడు. దీంతో పాయల్ కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరోవైపు పెళ్లైన నాలుగు రోజులకే భావిక్ కిడ్నాప్ కావడంతో పాయల్‌పై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె మొబైల్ కాల్ డేటా పరిశీలించిన తర్వాత గట్టిగా ప్రశ్నించారు. దీంతో బావ కల్పేష్‌తో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు పాయల్ తెలిపింది. తన తల్లిదండ్రులు భావిక్‌తో పెళ్లి చేయడంతో ప్రియుడితో చెప్పి కిడ్నాప్ చేయించి చంపించినట్లు చెప్పింది. కాగా, పాయల్ సమాచారంతో కల్పేష్ ఆచూకీని ట్రాక్ చేసిన పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరితో కలిసి భావిక్‌ను కిడ్నాప్ చేసి, వాహనంలో గొంతునొక్కి హత్య చేసినట్లు అతడు తెలిపాడు. ఆ తర్వాత సమీపంలోని కాలువలో మృతదేహాన్ని పడేసినట్లు చెప్పాడు. దీంతో భావిక్ మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశారు. కల్పేష్, మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పాయల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## భార్యతో కలిసి ఆప్‌లో చేరిన.. బీజేపీ నేత రమేష్ పెహల్వాన్

**న్యూఢిల్లీ:** బీజేపీ నేత రమేష్ పెహల్వాన్ తన భార్య కుసుమలతతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో ఆదివారం చేరారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకుని సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఆప్‌లో చేరారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు పోటీలో ఉన్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితాను ఆప్ ఆదివారం విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.





## ఒకే దేశం - ఎన్నిక బిల్లుపై కేంద్రం పునరాలోచన..?

**రేపు పార్లమెంట్‌లో బిల్లు పెట్టేది అనుమానమే..!**

ఒకే దేశంఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.

ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.

## అయ్యప్ప భక్తుల బస్సును ఢీకొట్టిన కారు..

**నవ దంపతులు సహా నలుగురు మృతి**





కేరళలో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లయిన 15 రోజులకే రోడ్డు ప్రమాదంలో నవ వధూవరులు దుర్మరణం చెందారు. శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప భక్తుల బస్సును కారు ఢీకొట్టడంతో నవ దంపతులు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలోని పథానంతిట్టకు చెందిన అను, నిఖిల్‌కు 15 రోజుల కిందట వివాహమైంది. పెళ్లి తర్వాత హనీమూన్‌కు మలేసియాకు వెళ్లి ఇవాళ తిరిగి కేరళకు వచ్చారు. ఈ క్రమంలో తిరువనంతపురంలో కొత్త దంపతులను రిసీవ్ చేసుకోవడానికి నిఖిల్ తండ్రి మథాయ్ ఈపన్, అను తండ్రి జార్జ్ బిజులు వెళ్లారు. వారంతా కారులో బయల్దేరి సొంతూరికి వెళ్తుండగా ఆదివారం ఉదయం 4.05 గంటల ప్రాంతంలో పనలూరుమువట్టుపుజ రహదారిపై పథానంతిట్ట జిల్లా మురింజకల్ వద్ద ప్రమాదం జరిగింది. తెలంగాణకు చెందిన అయ్యప్ప భక్తులు వెళ్తున్న బస్సును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నిఖిల్, జార్జ్ బిజు, ఈపన్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అను మృతి చెందింది.ఈ ఘటనలో బస్సు డ్రైవర్ సహా పలువురు అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జవ్వడంతో హైడ్రాలిక్ సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

## కోరిక తీర్చలేదని.. మహిళను హత్య చేసి మూడు ముక్కలుగా నరికిన వ్యక్తి



కోల్‌కతా: లైంగిక కోరిక తీర్చలేదన్న ఆగ్రహంతో ఒక వ్యక్తి మహిళను హత్య చేశాడు. ఆమె తల నరకడంతో పాటు మృతదేహాన్ని మూడు ముక్కలుగా కోశాడు. శరీర భాగాలను పలుచోట్ల పడేశాడు. తెగిన తలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో దర్యాప్తు చేసి చివరకు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం రీజెంట్ పార్క్ ప్రాంతంలో తెగిన మహిళ తల పాలిథిన్ బ్యాగ్‌లో ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే శనివారం చెరువు సమీపంలో మహిళ మొండెం, దిగువ భాగాన్ని పోలీసులు కనుగొన్నారు. కాగా, ఆ ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న 35 ఏళ్ల అతిఉర్ రెహమాన్ లస్కర్ నిందితుడిగా గుర్తించారు. సొంతూరుకు పారిపోయిన అతడ్ని అరెస్ట్ చేశారు. లస్కర్‌ను ప్రశ్నించగా లైంగిక కోరిక తీర్చనందుకు ఆ మహిళను హత్య చేసినట్లు పోలీసులకు చెప్పాడు.

మరోవైపు రెండేళ్ల కిందట భర్తను వీడిన 30 ఏళ్ల మహిళ కూలీగా పని చేస్తున్నదని పోలీసులు తెలిపారు. బావ వరుసైన లస్కర్‌తో కలిసి రోజూ పనికి వెళ్లేదని చెప్పారు. అయితే తన కోరిక తీర్చాలని అతడు వేధిస్తుండటంతో అతడి మొబైల్ నంబర్‌ను ఆమె బ్లాక్ చేసిందని అన్నారు. ఆ మహిళ తిరస్కరణ అతడికి కోపం తెప్పించిందని వెల్లడించారు. కాగా, డిసెంబర్ 12న గురువారం సాయంత్రం పని ముగిసిన తర్వాత నిర్మాణంలో ఉన్న భవనంలోకి రావాలని ఆ మహిళను లస్కర్ బలవంతం చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అక్కడ ప్రతిఘటించిన ఆమె గొంతు నొక్కి హత్య చేశాడని చెప్పాడు. ఆ తర్వాత మహిళ తల నరకడంతోపాటు శరీరాన్ని మూడు భాగాలుగా కోసి వేర్వేరు ప్రాంతాల్లో పడేశాడని వివరించారు. మహిళ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బెంగళూరు టెకీ కేసులో కీలక పరిణామం..

**అతుల్ సుభాష్ భార్య, అత్త అరెస్టు**

భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అతుల్ సుభాష్ భార్య నిఖితా సింఘానియా, అత్త నిషా, బావమరిది అనురాగ్‌ను కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. అతుల్ భార్య నిఖితాను హరియాణాలోని గురుగ్రామ్‌లో అరెస్టు చేయగా.. అత్త, బావమరిదిని ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచి. జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. భార్య వేధింపుల కారణంగా బెంగళూరుకు చెందిన టెకీ అతుల్ సుభాష్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అతను రాసిన 24 పేజీల సుదీర్ఘమైన లేఖ, 80 నిమిషాల వీడియో అందర్నీ కదిలించింది. సూసైడ్ నోట్‌లో తన భార్యతో కొనసాగుతున్న వైవాహిక బంధ వివాదం గురించి పేర్కొన్నాడు. భరణం కోసం తమ నాలుగేండ్ల కొడుకును తన భార్య తనపైకి అస్త్రంగా ప్రయోగించిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ కుటుంబ న్యాయస్థానంలో తనపై తన భార్య కుటుంబం పెట్టిన కేసుల్లో హత్య, అసహజ శృంగారం, భరణం కోసం నెలకు రూ.2 లక్షల డిమాండ్ ప్రధానమైనవని వెల్లడించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, టెకీ ఆత్మహత్య నేపథ్యంలో 'మెన్‌టూ' అన్నది ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది. చట్టాలన్నీ మహిళలకు అనుకూలంగానే ఉన్నాయని నెటిజన్లు పోస్టులు పెట్టారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ఉన్న ఐపీసీ సెక్షన్ 498ఏను దుర్వినియోగం చేయడంపై న్యాయస్థానాలు సైతం ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ క్రమంలోనే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అతుల్ భార్య, కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకున్నారు.



## ఢిల్లీ ఎన్నికల కోసం ఆప్ తుది జాబితా..

**న్యూఢిల్లీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ పోటీ**

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితా విడుదల చేసింది. (AAP's 4th list) తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. గ్రేటర్ కైలాష్ నుంచి మంత్రి సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పూర్ నుంచి గోపాల్ రాయ్ బరిలోకి దిగుతున్నారు. శకుర్ బస్తీ నుంచి సత్యేంద్ర కుమార్ జైన్, రాజిందర్ నగర్ నుంచి దుర్గేష్ పాఠక్ పోటీ చేయనున్నారు. కాగా, తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, సన్నాహాలతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'బీజేపీ కనిపించదు. సీఎం ఫేస్ వ్యక్తి, బృందం, ప్రణాళిక, ఢిల్లీపై దృష్టి వారికి లేదు. వారికి ఒకే ఒక్క నినాదం ఉంది. 'కేజ్రీవాల్‌ను తొలగించండి'. ఈ ఐదేళ్లలో ఏమి చేశారో వారిని అడగండి. 'కేజ్రీవాల్‌ను మేం దుర్భాషలాడాం' అని చెబుతారు' అని విమర్శించారు. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

